




VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్








RNI No.52722/90 సంపుటి : 34 సంచిక : 164 విశాఖపట్నం, 09 ఏప్రిల్ 2024 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00


## ఈశాన్య రాష్ట్రాల ప్రగతిపై మోదీ ప్రణాళిక



స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన ఈశాన్య ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఒకప్పుడు వివక్షకు గురై పాడుబడిన ప్రాంతంగా ఉన్న ఈశాన్య ప్రాంతం విస్తారమైన ప్రాంతంగా మారిందని ప్రధాని మోదీ వివరించారు. ప్రధాని మోదీ అస్సాం ట్రిబ్యూన్‌కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాల గురించి మాట్లాడారు. ఈశాన్య రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అన్ని రంగాలలో ఈ ప్రాంత యువకుల ప్రతిభపై తనకు పూర్తి విశ్వాసం ఉందని మోదీ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈశాన్య ప్రాంతంలో వివక్ష నెలకొందని.. తాము అధికారం చేపట్టిన నాటినుంచి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా మణిపూర్ విధ్వంసం గురించి కూడా మాట్లాడారు.

సంవత్సరాలుగా ఈశాన్య ప్రాంతాలను సందర్శిస్తున్నందున, ఆ ప్రాంతం ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల గురించి మీకు బాగా తెలుసునని మేము భావిస్తున్నాము. మీరు భారత ప్రధానిగా పదేళ్ల పదవీకాలంలో ఏ సమస్యలను పరిష్కరించగలిగారు? అన్న ప్రశ్నకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బదులిస్తూ.. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలపాటు ఈశాన్య రాష్ట్రాలు అట్టడుగున ఉండేవంటూ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈశాన్య ప్రాంత ప్రజలకు సవతి తల్లిలా వ్యవహరించాయి. ఎందుకంటే వారికి ఈ ప్రాంతంలో సంభావ్య ఎన్నికల లాభాలు చాలా తక్కువగా ఉన్నాయి. వారికి, ఈశాన్య చాలా దూరం.. దాని అభివృద్ధికి కృషి చేయడం కూడా కష్టంగా భావించాయన్నారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, ఈశాన్య రాష్ట్రాల స్థితిని మార్చాలనేది తన దృఢ నిబద్ధత.. ఒంటరితనం, అజ్ఞానం, విధానాన్ని ఏకీకరణ విధానంతో భర్తీ చేసామంటూ తెలిపారు.

గత 10 సంవత్సరాలలో ఈశాన్య ప్రాంతాల ఒంటరితనాన్ని ఎలా అంతం చేసామో.. తూర్పున భారతదేశం గేట్‌వేగా ఎలా అభివృద్ధి చేశామో గమనించవచ్చు.. అంటూ తెలిపారు. తాను దాదాపు 70 సార్లు ఈశాన్య ప్రాంతాలను సందర్శించానని.. ఇది బహుశా తనకు ముందు ఉన్న ప్రధానమంత్రులందరూ చేసిన మొత్తం సందర్శనల కంటే ఎక్కువ అన్నారు. 2015 నుంచి కేంద్ర మంత్రులు 680 కంటే ఎక్కువ సార్లు ఉత్తర తూర్పు ప్రాంతాలను సందర్శించారన్నారు.

ప్రజల ఇంటి వద్దకే పాలనను తీసుకెళ్లడం ద్వారా ఈశాన్య ప్రాంతం చాలా దూరంలో ఉందన్న అభిప్రాయాన్ని (మిగతా 2లో)

## దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలు ఇస్తాం : బాబు



ఏపీలో ఎన్నికల వేళ రాజకీయ పార్టీల హామీల పర్వం కొనసాగుతోంది. ముఖ్యంగా వచ్చే ఎన్నికల్లో తాము గెలిస్తే ఏమేం చేస్తామన్న దానిపై మ్యానిఫెస్టోల విడుదలకు ముందే పార్టీల అధినేతలు హామీలు ఇచ్చేస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన పెన్షన్ల విషయంలో రాష్ట్రవ్యాప్తంగా చర్చ నడుస్తున్న వేళ ఎన్డీయే కూటమిలో భాగమైన టీడీపీ అధినేత చంద్రబాబు దివ్యాంగులకు కీలక హామీ ఇచ్చారు. ప్రజాగళం సందర్భంగా ఆయన ఈ హామీ ఇచ్చారు.

సత్తెనపల్లిలో దివ్యాంగులు తనను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారని చంద్రబాబు తెలిపారు. వారి కోరిక పై తెలుగుదేశం- జనసేన- బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, దివ్యాంగులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇచ్చేందుకు హామీ ఇచ్చినట్లు చంద్రబాబు ఎక్స్ లో తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా దివ్యాంగుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.

మొదటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి, ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇచ్చింది తెలుగుదేశమేనని, తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతి యేటా విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించి వారిలోని ప్రతిభను గుర్తించేలా చేశామని చంద్రబాబు తెలిపారు. దివ్యాంగుల కోసం టీడీపీ (మిగతా 2లో)

## స్వరూపానందేంద్ర ఆశీస్సులు కోరిన రోజా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం, చినముషిడివాడలోని విశాఖ శ్రీ శారదా పీఠంను రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్.కె. రోజా సోమవారం సందర్శించారు. ముందుగా శ్రీ శారదా స్వరూప రాజ శ్యామలా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం పీఠంలోని ఇతర దేవతా మూర్తులను దర్శించుకుని, పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి, ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి (మిగతా 2లో)

## నేరస్థుడు అని తెలిసినా అవినాష్‌ను జగన్ కాపాడుతున్నారు: షర్మిల



**మైదుకూరు:** వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సీఎం జగన్ వారసుడే కాదని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శించారు. బస్సు యాత్రలో భాగంగా వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు నియోజకవర్గం బ్రహ్మంగారి మఠంలో ఆమె మాట్లాడారు. వైఎస్ పాలనతో జగన్ పాలనకు పొంతనే లేదన్నారు. భూతద్దం పెట్టి చూసినా ఆ ఆనవాళ్లు కనిపించవని చెప్పారు. మాజీ మంత్రి వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి నిందితుడని సీబీఐ చెప్పిందని.. కాల్ రికార్డులు, గూగుల్ మ్యాప్స్, లావాదేవీలు ఉన్నట్లు పేర్కొందని గుర్తుచేశారు. అన్ని ఆధారాలు ఉన్నా అతడిని జగన్ కాపాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**హంతకులకు ఓటు వేయొద్దు..**

“వైకాపా పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధరల స్థిరీకరణ అని చెప్పి జగన్ మోసం చేశారు. వైఎస్ఆర్ హయాంలో రైతు రారాజు.. ఇప్పుడు అప్పులేని రైతే లేడు. పంట నష్టం జరిగితే రూపాయి కూడా పరిహారం రావడం లేదు. డ్రిప్ వేసుకోవడానికీ అవకాశం లేకుండా సబ్సిడీలన్నీ ఆపేశారు. సంపూర్ణ మద్య నిషేధం హామీ ఇచ్చారు.. కానీ ప్రభుత్వమే విక్రయిస్తోంది. ఇష్టారీతిన అమ్ముతున్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు. 2.30లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తానని జగన్ హామీ ఇచ్చారు. మెగా డీఎస్సీ వేస్తామని చెప్పారు. నాలుగున్నరేళ్లు నిద్రపోయి కేవలం 6వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. జగన్‌ది హత్యా రాజకీయాలు చేసే పాలన. సొంత బాబాయిని చంపిన నిందితులను కాపాడుతున్నారు. నిందితుడిగా ఉన్న అవినాష్‌కే మళ్లీ టికెట్ ఇచ్చారు. అతడు చట్టసభల్లోకి వెళ్లకూడదు. అన్యాయాన్ని ఎదిరించేందుకే ఎంపీగా పోటీచేస్తున్నా. న్యాయం కోసం పోరాటం ఓ వైపు.. హంతకులు మరో వైపు.. ప్రజలు ఎవరిని గెలిపిస్తారో ఆలోచించాలి. హంతకులకు ఓటు వేయొద్దు. వైఎస్ఆర్ బిడ్డను గెలిపించాలని కోరుతున్నా. ఏ కష్టం వచ్చినా అందుబాటులో (మిగతా 2లో)

## నేడు కలెక్టర్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం ఉదయం సిరిపురం వద్ద గల వుడా చిల్డ్రన్ ఎరీనాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.వేద ఆశీర్వాదం, పంచాంగశ్రవణం, వేద పండితులకు సన్మానం, అనంతరం కలెక్టర్ సందేశం ఉంటుందని వారు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు జరిగే ఈ వేడుకలలో అధికారులు తెలుగుదనం ఉట్టిపడేలాంటి సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొనాలని జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులందరూ ఈ కార్యక్రమం లో పాల్గొంటున్నారని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ తెలిపారు.

## బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. సోమవారం డాబా గార్డెన్స్ విజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో బ్రహ్మకుమారిస్ ప్రతినిధి బి కే రామేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ సంబరాల్లో పలువురు పాల్గొని ఉగాది పండుగ విశిష్టతను తెలియజేశారు. తొలుత రామేశ్వరి మాట్లాడుతూ మన జీవితంలో జరిగే సంఘటనలు అన్నీ కూడా ఉగాది పర్వదినంతో ముడిపడి ఉంటాయన్నారు. అందువల్లే తీపి,కారం, చేదు ఇలా అన్నీ కూడా సమపాళ్లలో మిళితం చేసి ఉగాది పచ్చడి చేస్తారన్నారు. నూతన సంవత్సరాది పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ కూడా .పలు దేవాలయాలను సందర్శించి ఆధ్యాత్మిక భక్తి భావంతో ముందుకు సాగాలన్నారు. బ్రహ్మకుమారీస్ ప్రతినిధి సత్యవతి మాట్లాడుతూ పురాణ ఇతిహాసాల్లో ఉగాది పర్వదినానికి ఎనలేని ప్రాధాన్యత ఉందన్నారు. మానవ జీవన విధానంలో జరిగే సంఘటనలు ఆధారము గా పంచాంగ శ్రవణం లో పలు అంశాలు సందర్భానుసారము ప్రస్ఫుటం అవుతాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం సలహా మండలి సభ్యులు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఈ ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అందరూ బాగుండాలి,అందులో మనం ఉండాలి అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ ముందుకు సాగితే సమాజమంతా సశ్యశ్యామలంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలువురికి ఉగాది పర్వదినానికి సంబంధించిన కిట్లను రామేశ్వరి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ నిర్వాహకులు ఆర్ నాగరాజు పట్నాయక్ మాట్లాడుతూ జర్నలిస్టుల కుటుంబాలకు బ్రహ్మకుమారిస్ అండగా నిలవాలని ఆకాంక్షించారు. కొంతమంది నిరుపేద జర్నలిస్టుల పిల్లలను బ్రహ్మకుమారిస్ దత్తత తీసుకొని విద్యాభ్యాసం చేయించినట్లయితే వారు ఉన్నత విద్యతో అపారమైన ఉపాధి అవకాశంలు అందిపుచ్చుకోవాలి అన్నారు... కార్యక్రమం లో పావని తదితరులు పాల్గొన్నారు.




## (మొదటి పేజీ తరువాయిలు)

### ఈశాన్య రాష్ట్రాల ప్రగతిపై మోదీ ప్రణాళిక

మార్చుకున్నామన్నారు.. ఆజ్ ఈశాన్య నా ఢిల్లీ సే దూర్ హై.. ఔర్ నా దిల్ సే దూర్ హై! అంటూ మోదీ వివరించారు. గత ఐదేళ్లలో, ఈ ప్రాంత అభివృద్ధికి తాము చేసిన పెట్టుబడులు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదా మరే ఇతర ప్రభుత్వాలు కేటాయించిన నిధుల కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ.. అన్నారు. గత దశాబ్దంలో జరిగిన మౌలిక సదుపాయాల అభివృద్ధి ఈ ప్రాంతాన్ని మునుపెన్నడూ లేని విధంగా దేశంలోని ఇతర ప్రాంతాలతో, ప్రపంచంతో అనుసంధానించిందన్నారు. ప్రజల జీవితాలను సులభతరం చేసిన బోగీబీల్ వంతెన, భూపేన్ హజారికా సేతు వంటి దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న క్లిష్టమైన కనెక్టివిటీ ప్రాజెక్ట్‌లను తాము నెరవేర్చామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇటీవల, 13,000 అడుగుల ఎత్తులో నిర్మించిన సెల టన్నెల్‌ను ప్రారంభించే అవకాశం తనకు లభించిందన్నారు.

ఈశాన్య యువశక్తి, వారి ప్రతిభ, వారి నైపుణ్యం, వారి శక్తిపై నాకు నమ్మకం ఉందని మోదీ వివరించారు. విద్య, క్రీడలు, వ్యవస్థాపకత, అనేక ఇతర రంగాలలో వారికి తలుపులు తెరిచామన్నారు. 2014 నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు రూ.14,000 కోట్లకు పైగా ఖర్చు చేశామన్నారు. దేశంలోనే తొలి క్రీడా విశ్వవిద్యాలయం మణిపూర్‌లో ప్రారంభమైందన్నారు. మేము 8 రాష్ట్రాలలో 200 కంటే ఎక్కువ ఖేలో ఇండియా కేంద్రాలను నిర్మిస్తున్నామని.. గత దశాబ్దంలో ఈ ప్రాంతం నుండి 4,000 కంటే ఎక్కువ స్టార్టప్‌లు ఉద్భవించాయన్నారు. పండ్ల ఎగుమతి, సేంద్రీయ వ్యవసాయం, మిషన్ ఆయిల్ పామ్ వంటి వాటిని తీసుకురావడంతో ఈ ప్రాంతంలో వ్యవసాయం అభివృద్ధి చెందుతోందన్నారు. ఇలా నేడు, ఈశాన్య ప్రాంతం అన్ని రంగాలలో ముందు ఉందని తెలిపారు.

**తిరుగుబాటుదారుల సంఖ్య తగ్గింది..**

తిరుగుబాట్లు, చొరబాట్లు.. సంస్థాగత నిర్లక్ష్యానికి సంబంధించిన సుదీర్ఘ చరిత్ర ఉందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. తిరుగుబాటుదారులను దృఢంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నామని .. అయితే అదే సమయంలో, సామాన్య ప్రజలు చాలా శ్రద్ధతో.. కరుణతో వారికి చేరువయ్యేలా ప్రణాళికలు రచించామన్నారు. ఫలితంగా, తాము తిరుగుబాటును గణనీయంగా నియంత్రించినప్పటికీ, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోగలిగామని.. శాంతిని నిర్ధారించగలిగామని తెలిపారు. గత పదేళ్లలో మొత్తం 11 శాంతి ఒప్పందాలు కుదిరాయంటూ మోదీ పేర్కొన్నారు. ఇది గత ఏ ప్రభుత్వ హయాంలో చూడని అపూర్వమైన అభివృద్ధి అన్నారు. 2014 నుండి 9,500 మందికి పైగా తిరుగుబాటుదారులు లొంగిపోయారని.. 2014తో పోలిస్తే, 2023లో తిరుగుబాటు ఘటనలు 71 శాతం తగ్గాయన్నారు.

చైనా ఆక్రమణల గురించి మాట్లాడుతూ అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని భాగాలను చైనా సంవత్సరాలుగా తమ భూభాగాలుగా పేర్కొంటున్న విషయంపై మాట్లాడుతూ.. అరుణాచల్ ప్రదేశ్ భారతదేశం అంతర్భాగంగా ఉంది.. ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా నేడు అభివృద్ధి పనులు అరుణాచల్, ఈశాన్య ప్రాంతాలకు సూర్యుని తొలి కిరణాలలా చేరుతున్నాయన్నారు.

**మణిపూర్ ఘటనపై..**

మణిపూర్‌లో పరిస్థితి గురించి ప్రధాని మోదీ మాట్లాడుతూ.. సున్నితంగా ఎదుర్కోవడం తమ సమిష్టి బాధ్యత అని నమ్ముతున్నామన్నారు. ఇప్పటికే పార్లమెంటులో దీని గురించి మాట్లాడానని.. ఘర్షణను పరిష్కరించడానికి పరిపాలనా యంత్రాంగాన్ని మోహరించామన్నారు. శాంతి, సామరస్యాన్ని కాపాడేందుకు నిరంతరం కృషిచేస్తున్నామన్నారు. భారత ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోవడం, మణిపూర్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాల కారణంగా రాష్ట్ర పరిస్థితిలో గణనీయమైన మెరుగుదల కనిపించిందన్నారు. వివాదం తారాస్థాయికి చేరుకున్న సమయంలో హోంమంత్రి అమిత్ షా మణిపూర్‌లో ఉండి, వివాదాన్ని పరిష్కరించడంలో సహాయపడటానికి సమావేశాలు నిర్వహించారన్నారు. ప్రస్తుతం సహాయ, పునరావాస ప్రక్రియ కొనసాగుతోందని మోదీ తెలిపారు.

**మయన్మార్ నుంచి చొరబాట్లపై**

మిజోరంలో మయన్మార్ నుంచి చొరబాట్లపై మోదీ మాట్లాడుతూ.. మయన్మార్‌లోని అంతర్గత పరిణామాల కారణంగా భారతదేశంలోకి మయన్మార్ జాతీయుల ప్రవాహం ఎక్కువగా ఉందన్నారు. ఇది నేరుగా భారతదేశంపై, ముఖ్యంగా మన ఈశాన్య రాష్ట్రాలపై ప్రభావం చూపుతుందన్నారు. కాబట్టి మేము ఈ సమస్యను మయన్మార్ అధికారులతో లేవనెత్తామని.. చొరబాట్లను నిరోధించడానికి, మన సరిహద్దులను సురక్షితంగా ఉంచడానికి, ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు.

### దివ్యాంగుల పెన్షన్ రూ. 6 వేలు ఇస్తాం : బాబు

అమలుచేసిన ప్రత్యేక పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, కూటమి అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇస్తామని చంద్రబాబు ట్వీట్ లో తెలిపారు.

### స్వరూపానందేంద్ర ఆశీస్సులు కోరిన రోజా

వార్ల ఆశీస్సులు అందుకున్నారు. రానున్న ఎన్నికలలో విజయం సాధించడం కోసం విశాఖ శ్రీ శారదా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు పీఠం సందర్శనకు వచ్చినట్లుగానూ, ఎన్నికల ముందు స్వామివారిని దర్శించుకోవడం శుభ సూచకం అని రోజా తెలిపారు. మంత్రితో పాటు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి కూడా పాల్గొన్నారు.

### నేరస్థుడు అని తెలిసినా అవినాష్‌ను జగన్ కాపాడుతున్నారు: షర్మిల

ఉంటా" అని షర్మిల అన్నారు.

**వివేకాను చంపి మమ్మల్ని రోడ్ల పాల్జేశారు: సునీత**

ఆడది అంటే నారీ శక్తి అని వివేకా కుమార్తె సునీత అన్నారు. తమను అలాగే పెంచారని చెప్పారు. షర్మిలతో కలిసి బస్సుయాత్రలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. "తప్పు అంటే తప్పు అని చెప్పే మనస్తత్వం మాది. వివేకాను ఎవరు హత్య చేశారో అందరికీ తెలుసు. న్యాయం కోసం పోరాడుతున్నాం. ఆయన్ను చంపి మమ్మల్ని రోడ్ల పాల్జేశారు. షర్మిలను ఎంపీగా చూడాలనేది వివేకా కోరిక. ప్రజలు భారీ మెజారిటీతో ఆమెను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నా" అని సునీత అన్నారు.

## ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు కఠిన చర్యలు



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల విధుల్లో వైఫల్యాలకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ హెచ్చరించారు. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఎన్నికలపై జిల్లా ఎన్నికల అధికారి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయి సంసిద్ధత ఉండాలన్నారు. వచ్చే పది రోజులు కీలకమని, ప్రతి అంశంపై శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై వచ్చే ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రిటర్నింగ్ అధికారి స్థాయిలో చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికలకు నియమించిన ప్రతి బృందం సూక్ష్మ పరిశీలన చేయాలని, నియమావళి ఉల్లంఘనకు పాల్పడుతున్న ఉద్యోగులను కూడా గుర్తించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు నలుగురు ఉద్యోగులను విధుల నుండి తొలగించడం జరిగిందని ఆయన తెలిపారు. ఎన్నికలలో భాగంగా నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు, హింస, ప్రలోభాలు వంటి అంశాలపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. వీటిపై గట్టి నిఘా ఉండాలని, ఎటువంటి ఉల్లంఘనలు ఉన్నా కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సైతం ఆదేశాలు జారీ చేశారని ఆయన అన్నారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఆయన ఆదేశించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలని, సీజర్‌లు ఎక్కువ ఉండాలని ఆయన ఆదేశించారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. అన్ని బృందాలకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, వాహనాలకు ఎన్నికల కమీషన్ విధుల స్టిక్కర్లు అతికించాలని ఆయన చెప్పారు. ఇ వి ఎం ల రెండమైజేశన్ లో భాగంగా ఏజెంట్లు పెన్ను, పెన్సిల్, సెల్ ఫోన్లు తదితర సామగ్రి లోనికి తీసుకురాకూడదని ఆయన స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ వేసే కేంద్రం చుట్టు ప్రక్కల రాజకీయ కార్యకలాపాలు ఉండరాదని, వాటిపై దృష్టి సారించాలని సూచించారు.

**12,13,15 తేదీల్లో శిక్షణ**

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈ నెల 12, 13, 15 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు పాలకొండ శాసన సభ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి కల్పనా కుమారి, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి మరియు సాలూరు శాసన సభ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి సి. విష్ణు చరణ్, పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు పార్వతీపురం శాసన సభ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి కె.హేమలత, పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి మరియు కురుపాం శాసన సభ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వి వెంకట రమణ తమ నియోజక వర్గాలలో చేపట్టిన పనులను వివరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, ఎస్డిసి ఆర్ వి సూర్యనారాయణ, పార్లమెంటు నియోజకవర్గం సహాయ రిటర్నింగ్ అధికారి కె రామచంద్ర రావు, నోడల్ అధికారులు - జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా రవాణా అధికారి సి మల్లిఖార్జున రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి టి వి ఎస్ సుధాకర్,తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏయూకి ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వ విద్యాలయం ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2024, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ 2024లో స్థానం సంపాదిం చింది. ఈ మేర కు ఆ సంస్థ దీనికి సం బంధించిన సర్టిఫికేట్, మెడల్, పుస్తకా లను పం పింది. వీటిని ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో ప్రిన్సిపాల్స్‌తో కలిసి వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి ఆవిష్కరించారు. ఫిబ్రవరి 6 వ తేదీన ఏయూ ఇంజ నీరింగ్ కళాశాల మైదా నంలో 60 వేల మంది ప్రజలు కలిసి 'చేంజ్ ఫ్రం హ్యూమన్ బీయింగ్ టు బీయింగ్ హ్యూమన్' ప్రతిజ్ఞను చేసారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి స్వయంగా ఈ ప్రతిజ్ఞను చేయించారు. ఒకే ప్రాంగణంలో అత్యధిక సంఖ్యలో యువత పాల్గొని ఈ ప్రతిజ్ఞను చేయడాన్ని గుర్తిస్తూ ఏషియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించారు. ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ నిక్ వుజిసిక్ సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ప్రతిజ్ఞ అనంతరం యువతను ఉద్దేశించి నిక్ ప్రసంగించారు.

ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇటువంటి రికార్డును సాధించడం పట్ల ఏయూ ప్రిన్సిపాల్స్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్స్ ఏ.నరసింహా రావు, కె.శ్రీనివాస రావు, టి.శోభశ్రీ, వై.రాజేంద్ర ప్రసాద్, ఎస్.కె భట్టి, జి.శశిభూషణ రావు, దూరవిద్య సంచాలకులు ఆచార్య కె.విశ్వేస్వర రావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### విశాఖ రైల్వే స్టేషన్లో పాక్షికంగా కుంగిన ఫుట్ ఓవర్ బ్రిడ్జ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ రైల్వే స్టేషన్లో మూడవ ఎంట్రన్స్ ఎదురుగా ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ పాక్షికంగా కుంగింది. వెంటనే రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. కుంగిన ఫుట్ ఓవర్ వంతెన మీద రాకపోకలను నిలిపివేశారు. రైళ్ల రాకపోకలకు ప్రయాణికులకు ఎటువంటి అంతరాయం లేదని రైల్వే అధికారులు తెలిపారు. దీని మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు.

## పోలింగ్ విజయవంతం చేసే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదే



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ను విజయవంతం చేసే బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపైనే ఉందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత స్పష్టం చేసారు. స్థానిక ఎపి గురుకుల కళాశాలలో అరకు నియోజక వర్గం హుకుంపేట మండలం, పాడేరు నియోజక వర్గం పాడేరు మండలం ప్రెసెడింగ్ అధికారులకు శనివారం నిర్వహించిన మొదటి విడత ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. పది తరగతి గదులలో పాడేరు మండలానికి చెందిన 190 మంది హుకుంపేట మండలం 233 మంది ప్రిసైడింగ్ అధికారులకు అందిస్తున్న శిక్షణా కార్యక్రమాలను పరిశీలించారు. శిక్షణా తరగతి గదులను సందర్శించి ప్రెసెంగింగ్ అధికారులతో మాట్లాడుతూ నమ్మకంతో విధులు నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారుల్లో ఆత్మ విశ్వాసాన్ని నింపారు. శిక్షణలో అందిస్తున్న ఈ ఎంలు, వివిపాట్, కంట్రోల్ యూనిట్ నిర్వహణ, 17 ఎ రిజిష్టరు నిర్వహణపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అన్నీ తెలుసు, చాలా ఎన్నికలు నిర్వహించామని అనుకోకుండా ప్రతీ అంశాన్ని నేర్చుకోవాలని స్పష్టం చేసారు. ఎన్నికల నిర్వహణపై పంపిణీ చేసిన పుస్తకాలను క్షణ్ణంగా పదే పదే చదవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్నామనే విషయం గుర్తించుకుని మనసా వాచా కర్మణా పని చేయాలని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనలు అమలు చేసి ఎటువంటి అవాంతరాలు లేకుండా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలని స్పష్టం చేసారు.

**పోలింగ్ ప్రక్రియలో విషయ పరిజ్ఞానం ముఖ్యం**

పాడేరు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట ముందుగా అసెంబ్లీ స్థాయి మాష్టర్ ట్రైనర్లతో (ఎ.ఎల్. ఎం.టిలు) సమావేశం నిర్వహించారు. ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి సంపూర్ణ విషయ పరిజ్ఞానాన్ని అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన మొబైల్ యాప్లపై తగిన విధంగా శిక్షణ అందించి అవగాహన పెంచాలని తెలియజేసారు. పోలింగ్ నిర్వహణపై వీడియోలను వీక్షించడం వలన అవగాహన పెరుగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాలలో రహస్య పోలింగ్ కు అవసరమైన ఏర్పాట్లు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. వెబ్కాస్టింగ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలక మన్నారు. ఓటరు కంపార్టుమెంట్లోకి వెళ్లి ఓటు వేసిన తరువాత బీప్ శబ్దం వస్తుందని దానిని తప్పని సరిగా వినాలని సూచించారు. పోలింగ్ బూతులో ఉన్న ఎన్నికల అధికారులు అందరూ సమన్వయంతో పని చేయాలని అన్నారు. చెక్ లిస్టు, పి. ఓ డైరీ సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. సెక్టర్ అధికారులు వద్ద రెండు ఈవి ఎం పరికరాలను రిజర్వులో ఉంచడం జరుగుతుందని, ఎక్కడైన ఈవి ఎంలు పనిచేయక పోతే వెంటనే మార్చాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేసి సార్వత్రిక ఎన్నికలను విజయవంతం చేయాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి. వి. ఎస్. శర్మ, పాడేరు తాహశీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి అరకు వ్యాలీ తాహశీల్దార్ సోమేశ్వరరావు, పలువురు మాస్టర్ ట్రైనర్లు, సెక్టర్ అధికారులు 423 ప్రిసైడింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పంచాంగం

మంగళవారం 09-04-2024
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్రమాసం

| | |
|---|---|
| తిథి | : శు. పాడ్యమి రా. 10.06 |
| నక్షత్రం | : రేవతి ఉ. 08.57 |
| వర్జ్యం | : తె. 02.30 ల 04.58 |

### ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వండి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎన్నికల ప్రచారంలో భాగంగా అనకాపల్లి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ కసింకోట మండలం, పరవాడపాలెం గ్రామంలో ఆదివారం ఇంటింటికి వెళ్లి రాబోయే ఎన్నికల్లో తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి తమను, ఎంపీగా బూడి ముత్యాల నాయుడు ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యం అని అన్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఎమ్మెల్యేగా తనకు ఒక అవకాశం ఇస్తే అనకాపల్లి నియోజకవర్గం లో యువతకి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని అన్నారు.ఈ ప్రచార కార్యక్రమం లో అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి గునయ్య నాయుడు, కసింకోట మండల పార్టీ అధ్యక్షులు మలసాల కిషోర్, అనకాపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరక సోమునాయుడు, గ్రామ పార్టీ అధ్యక్షులు గొంతిన శివ బాబు, ఎంపీటీసీ సారిపల్లి అచ్చియమ్మ,సారిపల్లి అప్పారావు, డోప్ప ఈశ్వరరావు, పరవాడ కామేష్,పల్లా చిరంజీవి, గొంతిన శివనాయుడు, పందిరి కొండబాబు, మరియు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### 2024 లో 2 సూర్య గ్రహణాలు , 2 చంద్ర గ్రహణాలు

2024 సంవత్సరంలో రెండు సూర్య గ్రహణాలు , రెండు చంద్ర గ్రహణాలు ఏర్పడనున్నాయి. భూమికి - సూర్యుడికి మధ్య చంద్రుడు ప్రయాణిస్తే సూర్య గ్రహణం , చంద్రుడికి - సూర్యుడికి మధ్య భూమి ప్రయాణిస్తే చంద్ర గ్రహణం ఏర్పడుతుంది. గ్రహణాలకి హిందువులు చాలా ప్రాముఖ్యత ఇస్తారు.

ఈ సమయంలో శుభ కార్యాలు తలపెట్టరు. గర్భిణులు కూడా పలు జాగ్రత్తలు తీసుకుంటారు.

**2024 లో సూర్య , చంద్ర గ్రహణాలు ఎప్పుడు ఏర్పడతాయి ?** వాటి ప్రాముఖ్యత ఏమిటి?

**తొలి సూర్య గ్రహణం**

2024 లో తొలి సూర్య గ్రహణం ఏప్రిల్ 8 న ఏర్పడుతుంది. ఆ రోజు రాత్రి 9.12 గంటలకి ప్రారంభమై అర్ధరాత్రి 1.25 గంటలకు ముగుస్తుంది. గ్రహణానికి 12 గంటల ముందు సుతక్ కాలం ప్రారభమవుతుంది. భారత్ లో కనిపించదు. మనకు సుతక్ కాలం కూడా చెల్లదు. పశ్చిమాసియా , నైరుతి ఐరోపా , ఆస్ట్రేలియా , ఆఫ్రికా , ఉత్తర అమెరికా , దక్షిణ అమెరికా , అట్లాంటిక్ మహా సముద్రం , ఉత్తర ధ్రువం , దక్షిణ ధ్రువాల్లో తొలి సూర్యగ్రహణం కనిపిస్తుంది.

**రెండో సూర్యగ్రహణం**

రెండో సూర్యగ్రహణం అక్టోబర్ 2న ఏర్పడుతుంది. ఆరోజు రాత్రి 9.13 గంటలకి సూర్య గ్రహణం ఏర్పడి తెల్లవారుజామున 3.17 గంటల వరకు ఉంటుంది. ఇది కూడా భారత్ లో కనిపించదు. సుతక్ కాలం చెల్లదు. అమెరికా , దక్షిణ అమెరికా , అట్లాంటిక్ మహా సముద్రం ప్రాంతంలో కనిపిస్తుంది. 2024 లో భారత్ లో రెండు సూర్యగ్రహణాలు కనిపించవు.

**తొలి చంద్రగ్రహణం**

కొత్త ఏడాదిలో పెనుంబ్రా చంద్రగ్రహణం మార్చి 25న వస్తుంది. అమెరికా , ఆస్ట్రేలియా , ఇండోనేషియా , ఆఫ్రికా , ఫసిఫిక్ మహాసముద్రంలో చంద్రగ్రహణం కనిపిస్తుంది. భారత్ లో కనిపించకపోవడం వల్ల సుతక్ కాలం చెల్లదు.

**రెండో చంద్రగ్రహణం**

సెప్టెంబర్ 18 2024 లో చివరి చంద్రగ్రహణం ఏర్పడుతుంది. ఇది కూడా భారత్ లో కనిపించదు. యూరప్ , ఉత్తర , దక్షిణ అమెరికా ఆఫ్రికా , అట్లాంటిక్ మహాసముద్రం , ఆర్కిటిక్ మహాసముద్రం ప్రాంతాల్లో కనిపిస్తుంది. సూతక్ కాలం పాటించాల్సిన అవసరం లేదు. రెండు సూర్య , రెండు చంద్ర గ్రహణాలు భారత్ పై ప్రభావం చూపలేవు..

### ఇండిపెండెంట్ అభ్యర్థి నాగోతి నాగమణి కి బ్రహ్మారథం పడుతున్న పద్మనాభం మండల ప్రజలు

**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** పద్మనాభం మండలం లోని పలు గ్రామపంచాయతీలో భీమిలి నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థి నాగోతి నాగమణి పర్యటించారు ఈ పర్యటనలో భాగంగా నాగోతు నాగమణికి కు రపల్లి ఎస్సీ కాలనీ రేవిడి బర్లపేట బద్రయ్యపేట రౌతుల పాలెం గ్రామాలలో ప్రజల బ్రహ్మరథం పట్టారు ఆయా గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి తన అభ్యర్థత్వాన్ని గురించి చెప్పి సేవ చేసే నాలాంటి దానికి భీమిలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎల్లప్పుడూ మీ సమస్యలపై పోరాడుతానని మీ వెంటే ఉంటానని ఈ సందర్భంగా తెలియపరిచారు నా దృష్టికి ఏమైనా ప్రజలు ఇబ్బంది పడే సమస్యలు వస్తే వెంటనే పరిష్కార మార్గాలు చూపిస్తానని స్థానికరాలనైన నన్ను గెలిపించాలని ఈ సందర్భంగా అభ్యర్థించారు ప్రతి గ్రామం నుండి నాగోతి నాగమణికి ప్రజల నుండి ప్రత్యేక స్పందన వచ్చింది

విశాఖ సమాచారమ్
మంగళవారం 09-04-2024

# పరస్పర నిందలతోనే ప్రచారం

ఎన్నికల వాతావరణం క్రమక్రమంగా వేడుక్కుతోంది. ప్రధానమంత్రి అభ్యర్థి మొదలుకొని శాసనసభకు పోటీ చేసే అభ్యర్థి వరకు తమతమ ప్రచారాలను ప్రారంభించారు. భాజపా, ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు, ఇండియా కూటమి ఎవరికి తోచిన విధంగా వారు ఇతరులపై పరస్పరం నిందారోపణలు, నేరారోపణలు చేస్తున్నారు. ఎవరి ప్రచారం చూసినా కేవలం 10శాతం తమ గురించి, తమ ప్రణాళికల గురించి చెబుతూ 90శాతం సమయాన్ని ప్రత్యర్థులను నిందించడానికే వినియోగిస్తున్నారు.

తాముచేసే నిందలలో వాస్తవం ఎంతుందో? తమ ఆరోపణల బలం ఏమిటో? వారికి స్పష్టంగా తెలిసినప్పటికీ అబద్ధాలను నిజాలుగా భ్రమింపచేయడానికి అందరూ శాయశక్తులా ప్రయత్నాలు చేస్తున్నారు. తాము తమ మాటల ద్వారా ప్రజల మధ్య నిలిచేందుకు, గెలిచేందుకు, కొనసాగేందుకు ఎవరికి వారు సొంత పాఠాలు తయారు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అనేకమైన అభ్యంతరకర వ్యాఖ్యలు, చట్టవ్యతిరేకమైన పదప్రయోగాలు, జంతువులతోను, నేరస్థులతోను పోలికలు విస్తృతంగా వినియోగించబడుతుంటే వాటిని యథాతథంగా సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, ప్రింట్ మీడియా స్వీకరించి తిరిగి ప్రజలకు అందిస్తున్నాయి. ఇలాంటి సందర్భాలలో తమ పెద్దమనిషి తరహాను మీడియా మరిచిపోయి నీచమైన మాటలను ప్రచారం చేయడానికి ఆసక్తిని కనబరుస్తోంది.

నోటిదురుసు ఎంత ప్రమాదకరమో రాహుల్‌గాంధీ నీరవ్‌మోదీ విషయంలో చేసిన ఆరోపణ ఆయన పార్లమెంట్ సభ్యత్వం కోల్పోయేలా చేసింది. అనంతరం మళ్లీ కొంత వెసులుబాటు లభించినప్పటికీ ఆ కేసు ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇలాంటి అభ్యంతరకర వ్యాఖ్యల ద్వారా నాయకులు అనబడేవారు తమ పరువును తామే తీసుకుంటున్నారు. ప్రజలలో తేలికైపోతున్నారు. కానీ ప్రత్యర్థి బలం వారిలో ఆ విధమైన ఆవేదనపూర్వకమైన అనుచిత భాషణకు అవకాశం కల్పిస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ఒక బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమీషన్‌కు కొందరు ఫిర్యాదు చేయగా ఎన్నికల కమీషన్ అవి అభ్యంతరకర వ్యాఖ్యలుగా భావించి జగన్మోహన్‌రెడ్డికి తాఖీదులు కూడా పంపడం జరిగింది.

ఎన్నికల కమీషన్ ఎంత బలమైనదో, ఎంత శక్తివంతమైనదో ప్రజలకు పూర్తిగా అవగాహన లేదు. అలాగే కఠినచర్యలు తీసుకునే విషయంలో కూడా ఎన్నికల కమీషన్ అధికారులు సత్వరమే స్పందించకుండా, త్వరితగతిన ఫిర్యాదులు పరిష్కరించని కారణంగా ఎన్నికల కమీషన్ అంటే అభ్యర్థులలో భయం పోయింది. వాస్తవానికి ఎన్నికల కమీషన్ తలుచుకుంటే నేరస్థులు, వివిధ రకాల అభిశంసనలకు గురి అయినవారు పోటీ నుండి తక్షణమే తప్పుకోవల్సి వస్తుంది. కానీ పెద్దమనిషి తరహాలో ఈసీ వేచిచూచే ధోరణిని అవలంభించడం వల్ల అభ్యర్థుల ప్రవర్తనలో మార్పురావడం లేదు. దీనికి తగినట్లుగా న్యాయస్థానాలు కూడా నేరస్థులకు తాత్కాలిక ఊరట కల్పించడం వారిని మరింతగా అభ్యంతర వ్యాఖ్యలు చేసేందుకు, ఎన్నికల నియమావళి ఉల్లంఘించేందుకు పరోక్ష ప్రోత్సాహం కల్పిస్తోంది.

అల్లరిమూకలకు, దౌర్జనకారులకు ఎన్నికలలో చేతినిండా పని దొరుకుతోంది. పార్టీలపట్ల, అభ్యర్థుల పట్ల తిరుగుబాటు లేదా అవిధేయతలను ప్రదర్శించే వారిని కొట్టడానికో, చంపడానికో, భయభ్రాంతులను చేయడానికో ఈ ముఠాలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఆయా ప్రాంతాలలోని పోలీసు అధికారుల ఆశీర్వాదం వీరికి మెండుగా లభిస్తోందని ప్రత్యర్థులు ఆరోపించడం, ఎన్నికల కమీషన్ వారిని బదిలీలు చేయడం, అయితే వారి స్థానంలో అంతకంటే విధేయులను ప్రభుత్వాలు నియమించడం ఈ ప్రక్రియలో ఉన్నతాధికారులు తమ ప్రత్యేకతను ప్రదర్శించడం జరుగుతోంది. ఏనుగుల పోరాటంలో నక్కలు నలిగిపోయినట్లు రాజకీయ ప్రధాన నేతల క్రోధానికి గురి అయిన ఇతర పార్టీల సాధారణ నేతలు, కార్యకర్తలు అన్నిరకాలుగాను నష్టపోతున్నారు.

సున్నితమనస్కులు, భయస్థులు, ఎన్నికలు అన్నా, ప్రచారం అన్నా, ఓటు అన్నా భయపడి ఇండ్లకు పరిమితం అయిపోతున్నారు. కొన్ని కులములకు చెందిన వృద్ధులు, మహిళలు, ఓటింగ్‌కు కూడా దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు అనగానే స్వచ్ఛందంగా, నిజాయితీగా, ఎటువంటి దౌర్జన్యాలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా, ధర్మబద్ధంగా నిర్వహించబడిన రోజు 90శాతం ఓటర్లు తమ ఓటును ఇష్టానుసారంగా వినియోగించుకోవడం జరుగుతుంది. ప్రజలకు నిజంగా ఇష్టుడైన, సమర్థుడైన, నిజాయితీ గల అభ్యర్థులకు రాజకీయాలలో స్థానం, గౌరవం, చట్టసభలలో అడుగుపెట్టే అవకాశం లభిస్తుంది.

-సూరంపూడి వీరభద్రరావు

# గాయత్రీ విద్యా పరిషత్ కళాశాలలో ఉగాది వేడుకలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఎంవీపీ. విశాఖపట్నం బ్రాంచిలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రార్థన చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా సంస్కృత ఆచార్యులు మహీధర నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు. ముఖ్య అతిథిని భాషా విభాగాధిపతి డాక్టర్ వి.వెంకటేశ్వరశర్మ గారు పరిచయం చేశారు. ముఖ్యఅతిథి మహీధర్ నాగేశ్వర్ రావు తమ సందేశంలో మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఉగాది ప్రధాన పండుగ. హిందూ క్యాలెండర్ ప్రకారం చైత్రమాసం మొదటి రోజున ఉగాది పండుగను జరుపుకుంటారు.మామిడి ఆకులను ప్రవేశద్వారం వద్ద కట్టి ఉగాది రోజున ఇండ్లలో షట్ రుచులతో పచ్చడి చేసే సంప్రదాయం ఉంది. ఇక్కడ దొరికే మామిడి, కొబ్బరి, వేప పూలు, బెల్లం వంటి వాటితో దీన్ని తయారు చేస్తారు. జీవితంలో మనం తీపి మరియు చేదు అనుభవాలను అనుభవించవలసి ఉంటుందని మన జీవితంలో మనకు తెలుసు. ఈ పండుగ సమయంలో వసంత ఋతువు పూర్తి స్థాయిలో ఉంటుంది.

దీని కారణంగా వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది, దీనితో పాటు, ప్రజలు కూడా ఈ సమయంలో కొత్త పంట గురించి సంతోషంగా ఉన్నారు. గతాన్ని వదిలేసి భవిష్యత్తుపై దృష్టి సారించి, సానుకూలతతో కొత్తగా ప్రారంభించాలని మనల్ని గుర్తించే సంవత్సరం ఉగాది. దీనితో పాటు, ఈ రోజున ఏదైనా కొత్త పనిని ప్రారంభించడం ఖచ్చితంగా విజయం సాధిస్తుందని ఒక నమ్మకం ఉంది, అందుకే ఉగాది రోజున, దక్షిణ భారత రాష్ట్రాల్లోని ప్రజలు దుకాణాలు తెరవడం, భవనాల నిర్మాణం ప్రారంభించడం వంటి కొత్త పనులను ప్రారంభిస్తారు.

అంతే కాదు, పంచాంగ శ్రవణ ప్రాముఖ్యతను చెపుతూ,పంచాంగాన్ని చదివి వినిపించారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్లకు, నాన్ ప్రొఫెసర్లకు కొన్ని పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వందన సమర్పణ తెలుగు విభాగాధిపతి డా.యు.వి.ఎస్.ఎస్ శాస్త్రి గారు చేసారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ విద్యా పరిషత్ ఉపాధ్యక్షులు శ్రీ డి.దక్షిణామూర్తి, కార్యదర్శి ఆచార్య సోమరాజు, పరిశోధన సంచాలకులు ఆచార్య పివి శర్మ, ఆచార్య యస్. రజనీ,ప్రిన్సిపాల్‌గాయత్రీ విద్యా పరిషత్ ,ఆచార్య ఆనంద్ అయ్యగారు.యు.జి. డైరెక్టర్, ఆచార్య వి.రాజ గణపతి , ఆచార్య కామేశ్వర్ రావు , మాస్ కమ్యూనికేషన్ ఆఫీసర్ శ్రీమతి పద్మా , ఆచార్యులు,ప్రెస్, మీడియా తది తరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలుగువారి సంవత్సరాది "ఉగాది"




**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** క్రోదినామ ఉగాదిని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాఅలో ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాస పాత్రుడు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయభారతి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ఉగాది పండగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది ఉగాది అని, హిందూ సమాజానికి ఉగాది నుంచే నూతన సంవత్సరం ప్రారంభం అవుతుందని, ఇది తెలుగు వారికి తొలి పండుగ అన్నారు. విద్యార్థులు అందరి మధ్య ఈ వేడుకను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు సహా కళాశాల అధ్యాపకులు ఉగాది పండగ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది ఆయన డాక్టర్ కెసిఆర్ మేడం కంప్యూటర్ సైన్స్ మేడం కే లీలా పావని, జగదీష్ బాబు, జగత్ రాయ్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మా బ్రతుకు చిరునవ్వులు వెనుక ఉన్న ఓకే ఒక్క ధైర్యం - అవంతి



**భీమునిపట్నం, (విశాఖ సమాచారమ్):** సీనియర్ నాయకులు అక్కరమాని రామానాయుడు పిలుపు మేరకు వార్డు ప్రెసిడెంట్ జగ్గుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం 1వ వార్డు లో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.22వ రోజు 1వ వార్డు లో జరిగిన గడప గడపకు వెళ్ళి ఫ్యాన్ గుర్తు పై ఓటేసి నన్ను మూడోసారి ముచ్చటగా - యంపి అభ్యర్థి బొత్సా ఝాన్సీ ని అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం చేసిన భీమిలి వైసిపి పార్టీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు.

22వ రోజు ప్రచారం కి విచ్చేసిన అవంతి కి వార్డు ప్రెసిడెంట్ జగ్గుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో తీన్మార్ మోతలతో - బాణాసంచా లతో - గడప గడప నా మంగళ హారతులతో - జై జగన్ జై అవంతి అంటూ అశెష జనం అడుగడుగునా బ్రహ్మరథం పట్టగా నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీ ర్యాలీ తో సాదర స్వాగతం పలకడం జరిగింది.

ఫ్యాన్ గుర్తు పై ఓటేసి నన్ను యంయల్ఏ గా బొత్సా ఝాన్సీ ని పార్లమెంట్ సభ్యురాలు గా గెలిపించడానికి మీరు సిద్ధమా అని అవంతి ప్రజలను అడగ్గానే మేమంతా సిద్ధం అంటూ నినాదాలతో హోరెత్తించారు.

అనంతరం కార్యక్రమం ను ఉద్దేశించి అవంతి మాట్లాడుతూ కత్తి మీద సాము లాంటి ఇదే భీమిలి లో ప్రజలు నన్ను రెండు మార్లు అషామాషీ గా గెలిపించలేదని నిరంతరం ప్రజలు మధ్య ఉండి వారి కి అవసరమయ్యే సేవలు అందించాలన్నదే లక్ష్యంతో భీమిలి ప్రజలు పట్ల అంకిత భావంతో పని చేయడం వల్లనే ప్రజలు నాకు ఎప్పుడూ మద్దతు పలకడం చేసారని, ఎలక్షన్ ముందు మాటలు చెప్పి తరువాత కనపడకుండా ఉండటం నాకు రాదని చేతలతో ప్రజలకు మంచి సేవలు అందించడం నాకు తెలిసిన పాలన అని,చాలా మంది భీమిలి లో అభివృద్ధి ఎక్కడ అని సోషల్ మీడియా లో ఏవేవో ప్రచారాలు చేస్తూ ఉంటారు.వారందరకి నేను చెప్పేది ఒకటే అభివృద్ధి అనేది వాట్సప్ గ్రూపుల్లో సోషల్ మీడియా లోనే మీ లేనిపోని ఆరోపణలు లోనో కనపడదు ఒకసారి గ్రామాల్లో వార్డుల్లో వెళ్ళి చూస్తే కనపడుతుంది.ఇదే భీమిలి నియోజకవర్గం లో గత ఎన్నో ఏళ్ళ నుంచి ఉన్న దీర్ఘకాలిక సమస్యలు ను చాలా వరకూ పరిష్కారం చేయడం జరిగింది అని,ఈ 5ఏళ్ళ లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తోడ్పాటు తో 2,500 కోట్లు సంక్షేమం అభివృద్ధి క్రింద ఖర్చు చేయడం జరిగిందని,గత ప్రభుత్వాలు పాలనలో సం కి ఒక నియోజకవర్గం కి కేవలం 4 కోట్లు మాత్రమే నిధులు మంజూరు చెసే పరిస్థితి ఉండేదని,వైసిపి ప్రభుత్వం జగనన్న పాలనలో వేల కోట్ల రూ మంజూరు చేసి అభివృద్ధి పథంలో నడపడం రాజకీయ చరితలో ఇదే ప్రపథమం అని, జీవియంసి మధురవాడ జోన్ లో పార్కులు నిర్మాణం అలాగే పార్కులు అభివృద్ధి చేయడం జరిగింది అని,గడప గడప లో గుర్తించిన సమస్యలు పరిష్కారం చేయడం జరిగింది అని,మాయ మాటలతో కోటలు కట్టడం మాకు రాదు చేతలతో చేసి చూపించడమే మాకు తెలిసిన పాలన అని,ఎలక్షన్ కి ముందు ఏదైతే మాటిచ్చానో అదే మాట ప్రకారం అంచె అంచెలు గా భీమిలి అభివృద్ధి కి కట్టుబడి ఉన్నానని గతంలో రెండు సార్లు ఇదే భీమిలి లో నన్ను గెలిపించారని రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తు పై ఓటేసి నన్ను మూడోసారి ముచ్చటగా గెలిపించాలని కోరుతూ మాట్లాడారు.

ఈ కార్యక్రమంలో జీవియంసి 1వ వార్డు వైసిపి శ్రేణులు - ఆయా ఆయా పదవుల్లో ఉన్న వారు - సచివాలయం కన్వీనర్ లు గృహ సారథులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# సిఎం రమేష్ కి అనకాపల్లి వెలమ సంఘం మద్దతు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గాంధీ నగరంలోఅనకాపల్లి వెలమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వెలమ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం కు ముఖ్య అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి సిఎం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు సీఎం రమేష్ ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో బీజేపీ,టీడీపీ,జనసేన ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేష్ మాట్లాడుతూ వెలమ సోదరులు తనకు మద్దతు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సహకారంతో ఎంపీగా గెలిచిన వెంటనే అనకాపల్లి అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు. అనకాపల్లి ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే సంఘ పెద్దలు చేసే అభివృద్ధి కార్యక్రమాలకు తన సహకారం ఉంటుందన్నారు.మాజీ ఎమ్మెల్సీ పి. మాధవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ తో మంచి సంబంధాలు ఉన్న సి ఎం రమేశ్ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంతో మంచి సంబందాలు కలిగిన వ్యక్తి కనుక , సిఎం రమేశ్ గెలుపుతో అనకాపల్లి మరింత అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్,ఈర్నే శ్రీరామమూర్తి, ద్వారపు రెడ్డి పరమేశ్వరావు, వెలమ భవన్ స్థలదాత మిరియాల రాజేంద్రప్రసాద్, పరుచూరి భాస్కర్ రావు, రమేష్ ,సంఘ అధ్యక్షులు భీమ, కళ్యాణి,లాలం కన్నాజి, రాజాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది ఎందుకు జరుపుకుంటారు? ఉగాది పచ్చడి ప్రాముఖ్యత ఏంటి?

ఉగాది అంటే అందరికి గుర్తుకు వచ్చేది తెలుగు వారి పండుగ. తెలుగు సంవత్సరం ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. కాబట్టి ఇది తెలుగు వారి పండుగ గుర్తింపు తెచ్చుకుంది. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు వచ్చే ఈ పర్వదినానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నూతన సంవత్సరంలో రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకొని గ్రహశాంతులు లాంటివి జరిపించుకొని సుఖంగా ఉండేందుకు పంచంగ శ్రవణాన్ని చేస్తారు. క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలకనున్న నేపథ్యంలో ఉగాది విశిష్టత, చరిత్ర గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ఉగాది విశిష్టత..

చైత్ర మాసం శుక్లపక్షం పాడ్యమి రోజున ఆ విధాత ఈ జగత్తును సృష్టించాడని నమ్ముతారు. సోమకుడు వేదాలను తస్కరించిన కారణంగా మత్స్యావతారం ధరించిన విష్ణువు అతడిని సంహరించి వాటిని తిరిగి బ్రహ్మదేవుడికి అప్పగించిన సందర్భంగా 'ఉగాది' ఆచరణలోకి వచ్చిందని పురాణప్రతీతి. చైత్ర శుద్ధ పాడ్యమి రోజున సూర్యోదయ వేళలో బ్రహ్మ దేవుడు సృష్టిని సృష్టించాడని అంటారు. అంటే కాలగణాన్ని గ్రహ, నక్షత్ర, రుతు, మాస వర్ష, వర్షాధికులను బ్రహ్మదేవుడు ఆ రోజు వర్తింపజేస్తాడని నమ్మకం. అంతేకాకుండా వసంత రుతువు కూడా ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. అందుకే నూతన జీవితానికి నాందిగా ఉగాది పండుగను జరుపుకుంటారు.

శాలివాహనుడు పట్టాభిషిక్తుడైన ఈ రోజు ప్రాశస్త్యంలోకి వచ్చిందని మరో గాథ ఉంది. 'ఉగాది', 'యుగాది' అనే రెండు పదాలు వాడుకలో ఉన్నాయి. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. నక్షత్ర గమనానికి ఆది ఉగాది అంటే సృష్టి ఆరంభమైనదినమే ఉగాది. యుగం అనగా 'ద్వయం లేదా



'జంట' అని అర్థం. ఉత్తరాయణ, దక్షిణాయణ ద్వయ సంయుతం యుగం కాగా.. ఆ యుగానికి ఆది యుగాదిగా మారింది. ఉగాది శబ్దానికి ప్రతిరూపంగా ఉగాదిగా రూపాందింది.

తెలుగువారే కాకుండా మరాఠీలు కూడా ఈ రోజు 'గుడిపడ్వా'గా, తమిళులు 'పుత్తాండు' అనే పేరుతో, మలయాళీలు 'విషు' అనే పేరుతో, సిక్కులు 'వైశాఖీ'గా, బెంగాలీలు 'పోయ్ లా బైశాఖ్' గా జరుపుకుంటారు.

**ఉగాది పచ్చడి ప్రాముఖ్యత..**

ఉగాది రోజు ముఖ్యమైన వంటకం ఉగాది పచ్చడి. షడ్రచుల సమ్మేళనంగా చేసే ఈ పచ్చడి జీవితంలో జరిగే వివిధ అనుభవాలను సూచిస్తుంది. జీవితంలో అన్ని భావనలను చెప్పే భావం ఇందులో ఇమిడి ఉంది. పచ్చడి ఒక్కొక్క పదార్థం ఒక్కో భావానికి, అనుభవానికి ప్రతీక.

**బెల్లం**- తీపి- ఆనందానికి ప్రతీక

**ఉప్పు**- జీవితంలో ఉత్సాహం, రుచికి సంకేతం

**వేప పువ్వు**- చేదు- బాధకలిగించే అనుభవాలు

**చింతపండు**-పులుపు-నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులు

**పచ్చి మామిడి ముక్కలు**- వగరు - కొత్త సవాళ్లు

**కారం**- సహనం కోల్పోయేటట్లు చేసే పరిస్థితులు

**తెలుగు వారికి ఉగాది, మరి మిగతా రాష్ట్రాలకు?**

చైత్ర శుక్ల పాడ్యమి నాడే అనగా ఉగాది రోజున సృష్టి జరిగిందని నారద పురాణంలో వివరించారు. వసంతం ప్రారంభమైన చైత్రశుక్ల పాడ్యమి రోజున సూర్యుడు దినరాజై ఉండగా ప్రజాపతి బ్రహ్మ రస జగత్తును సృష్టించాడు. కాల గణన, గ్రహ నక్షత్ర, రుతు, మాస వర్షాలను, వర్షాధిపులను ప్రవర్తింప చేశాడు. తెలుగు వారు చాంద్రమానాన్ని అనుసరిస్తారు. కాలగమనంలో మార్పులు సహజం. కల్పంలో యుగాలు. ఈ యుగాలు మారేకొద్దీ ధర్మాలు కూడా మారుతాయి. ప్రస్తుతం కలియుగం నడుస్తోంది. తెలుగు సంవత్సరాలకు ప్రత్యేకంగా పేర్లు ఉన్నాయి. ఆయా పేర్లను బట్టి ఫలితాలు ఎలా ఉంటాయో ఊహించి చెప్పవచ్చు. తెలుగు సంవత్సరాలు 60. ప్రభవతో మొదలై అక్షయతో ముగిస్తే ఒక ఆవృతం పూర్తయినట్లు. మళ్లీ తిరిగి ప్రభవతో ఆరంభమవుతుంది.

ఈ పేర్ల వెనుక భిన్న వాదనలు, కథనాలు ఉన్నాయి. ఓ పురాణ కథనం ప్రకారం శ్రీకృష్ణుడి 16100 మంది భార్యల్లో సందీపని అనే రాజకుమారికి 60 మంది సంతానం. వారి నామాలనే తెలుగు సంవత్సరాలకు పెట్టారని అంటారు. నారదుడి పిల్లల పేర్లు వీటికి పెట్టారనే మరో కథ కూడా ప్రాచుర్యంలో ఉంది. దక్షుడు కుమార్తెల పేర్లుకూడా ఇవేనని అంటారు.

హిందువులకు అత్యంత శ్రేష్ఠమైన ఈ పండుగను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో జరుపుకుంటారు. ఆంధ్ర, తెలంగాణ కర్ణాటకల్లో ఉగాది పేరుతోనూ, మహారాష్ట్రలో గుడిపాడ్వా పేరుతో పిలుస్తారు. తమిళులు పుత్తాండు, మలయాళీలు విషు అనే పేరుతోను, సిక్కులు వైశాఖీ గానూ, బెంగాలీలు పాయ్‌లా బైశాఖ్ గానూ జరుపుకుంటారు. అయితే పేర్లు మారినా పండుగలను జరుపుకోవడంలో పెద్దగా తేడాలు లేవు.

# విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సమాజాభివృద్ధికి కళాకారులు దిక్సూచిగా నిలుస్తున్నారని పద్మశ్రీ యడ్ల గోపాలరావు, ఉపకార సచ్ఛంద సేవా సంస్థ సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్చుతా రావు పేర్కొన్నారు. సోమవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో వీరు మాట్లాడుతూ కళాకారులు తమ ప్రతిభా పాటవాలు ద్వారా సమాజాన్ని జాగృతం చేస్తున్నారన్నారు. గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విశాఖ కళా నైపుణ్యం అంతర్జాతీయ ఖ్యాతిని అర్జిస్తుందన్నారు.

కళా కారులు కరోన సమమంలో అనేక ఇబ్బందులు. ఎదురుకున్నారన్నారు. తన పరిధిలో స్థానిక కళాకారులకు సహాయాన్ని అందించినట్టు తెలిపారు.

మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ మన కళా ప్రతిభను ప్రోత్సహిస్తూ కళాకారులను సత్కరించడం గర్వించదగ్గ విషయం అన్నారు. విశిష్ట కళాకారులుగా సమాజాన్ని జాగృతం పరుస్తున్న కళాకారులు డాక్టర్ రాపేటి అప్పారావు, పల్సర్ ఇతాష్, రమేష్ పట్నాయక్ సింగర్) పల్సర్ బైక్ ఝాన్సి,' 'కొరియోగ్రాఫర్ ch. రమేష్, పి. ప్రసాద్, లస్- డేవిడ్ రాజ్, జి. డింపల్, బొట్టా నాగేశ్వరరావు, నాట్యాచార్యులు సందీప్ వంటి వారికి ఉగాది పురస్కారాలు అందించారు. కంచర్ల అచ్యుతరావుకు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొరియా గ్రాఫర్, సీనియర్ జర్నలిస్ట్ ఆర్. నాగరాజ్ పట్నయక్, శివ జ్యోతి, జనార్ధన్, పి. అరుణ్ సాయి, ధనాంజయ్, ప్రసాద్, కళ్యాణ్, అమరనాధి, విజయరమణి, సత్య తదితరులు పాల్గున్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# దివ్యాంగులకు త్వరలో మంచి రోజులు రానున్నాయి - కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** వికలాంగులకు త్వరలో మంచి రోజులు రానున్నాయని మాజీ మంత్రి అనకాపల్లి జనసేన బిజెపి టిడిపి ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. సోమవారం రింగ్‌రోడ్ లోని జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పాలాభిషేకం జరిగింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు వేల రూపాయలు పెన్షన్ 6000 రూపాయలకు పెంచడం జరుగుతుందని చంద్రబాబు ఇచ్చిన హామీ దివ్యాంగుల జీవితాల్లో వెలుగును నింపింది అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న వికలాంగులకు చంద్రబాబు నిర్ణయం ఆనందాన్ని కలిగించిందన్నారు. దివ్యాంగులు భయపడాల్సిన పని లేదన్నారు. వారికి అండగా నిలవడం జరుగుతుందన్నారు. ముందుగా పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి ఉన్నప్పుడు వికలాంగులకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా పింఛన్లు అందజేయడం జరిగిందన్నారు వారికి ఆపరేషన్లకు నిధులు కేటాయించామన్నారు. చంద్రబాబు అరెస్ట్ చేసినప్పుడు వికలాంగుల పడ్డ వేదన ఇంతా అంతా కాదన్నారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు ద్వారపు రెడ్డి పరమేశ్వరరావు మాట్లాడుతూ వికలాంగులను దేవుడు పుత్రులుగా భావించి దివ్యాంగులుగా నామకరణం చేసిన వ్యక్తి నరేంద్ర మోడీ అన్నారు. ముందుగా వికలాంగులు చంద్రబాబు హామీ పట్ల హర్షం వ్యక్తం చేశారు పాలతో చంద్రబాబు చిత్రపటానికి అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంఘం అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ నాదముని ఫణీంద్ర తెలుగుదేశం నాయకులు మల్ల సురేంద్ర షేక్ బాబర్ తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు చంద్ర బాబుకు అనగుణంగా నినాదాలు చేశారు.

# నూకాంబికను దర్శించుకున్న మేయర్ దంపతులు



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** పాత ఆరిలోవ గ్రామంలో వెలసిన నూకాంబికను సోమవారం మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. అమ్మ వారి వార్షిక మహోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా మేయర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు బాలారావు శర్మ, ఉమా శంకరరావు శర్మ, గోపీకృష్ణ శర్మతో పాటు ఆలయ కమిటీ సభ్యులు మేయర్ దంపతులకు స్వాగతం పలికారు. ఈ నెల 8న సాయంత్రం ఇక్కడ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమ్మలగన్న అమ్మ నూకాంబిక ఈ ప్రాంత ప్రజలందర్నీ చల్లగా చూడాలని మొక్కుకున్నామన్నారు.

# వైసీపీ పాలన అంతం అయితేనే రాష్ట్రభవిష్యత్





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** రాష్ట్రాన్ని డ్రగ్స్ క్యాపిటల్ గా మార్చిన వైసిపి ప్రభుత్వాన్ని ఈడ్చి రాష్ట్రం అవతల పారేస్తాం. రాష్ట్రాన్ని రక్షించుకోవడమే నా ముందున్న లక్ష్యం. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని కాపాడుకొంటామని అనకాపల్లి నూకాలమ్మ తల్లి సాక్షిగా చెబుతున్నాను అని జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. ఆదివారం అనకాపల్లిలో వారాహి విజయభేరి యాత్ర సభలో అశేష జనవాహిని మధ్య పవన్ కళ్యాణ్ ఉద్యోగ భరితంగా ప్రసంగించారు. అధికారం ఇచ్చి చూస్తే ఏ వ్యక్తి వ్యక్తిత్వం అయినా బయటపడుతుంది అంటారు. ఈ ముఖ్యమంత్రికి అధికారం ఇస్తే ఏ చేశాడో రాష్ట్ర ప్రజలకు ఈపాటికే అర్ధం అయింది. అందుకే ఎన్నికలు ఎప్పుడు వస్తాయా. కూటమి ప్రభుత్వాన్ని ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. అనకాపల్లి శాసనసభ స్థానం నుంచి పోటీలో ఉన్న జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ, లోక్ సభ స్థానం నుంచి పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థి సి.ఎం.రమేశ్‌లను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు."రాష్ట్ర భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని, రాబోయే తరం బాగుపడాలనే తపనతోనే జనసేన పార్టీ వెనక్కు తగ్గింది. ఏ పార్టీ అయినా పెరిగిన ప్రజాబలాన్ని మరింత పెంచుకొని, ఎన్నికల్లో ఎక్కువ సీట్లు అడగాలని భావిస్తుంది. జనసేన పార్టీ మాత్రం తనకు తాను తగ్గించుకొని రాష్ట్ర భవిష్యత్తు కోసం రెండు పార్టీలను కలిపి, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంది.

**సమర్థత ఉన్న నాయకుల సమూహం జనసేన**

కొణతాల రామకృష్ణ , నాదెండ్ల మనోహర్ మండలి బుద్ధ ప్రసాద్ వంటి అనుభవం, సమర్థత ఉన్న నాయకులు గెలిచి అసెంబ్లీలో ప్రజల కోసం మాట్లాడాలి. ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ఇలాంటి నాయకులు అసెంబ్లీలో ప్రజల కోసం పాలసీలు తీసుకొస్తే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని బలంగా నమ్ముతున్నాను. కచ్చితంగా పూర్తి రాజకీయ అవగాహన, ప్రజల కోసం ఆలోచించే నాయకులు ఆంధ్రప్రదేశ్ బాగు కోసం నిలబడతారు. దశాబ్దకాలం పాటు ఎంతో నిబద్ధతతో పార్టీని నడిపాను. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీతో ఉన్న సాన్నిహిత్యం ఉపయోగించుకొని ఓ మంత్రి పదవి, ఎంపీ పదవి తెచ్చుకోవడం పెద్ద లెక్క కాదు ప్రజల భవిష్యత్తు కోసం బలంగా నిలబడాలనే తలంపుతోనే ముందడుగు వేశాను.

2019 ఎన్నికల ముందు అమ్మఒడి పథకం ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో 83 లక్షల మంది పిల్లలకు పథకం వర్తించాలి. అయితే వైసీపీ ప్రభుత్వం పాలన మొదలుపెట్టాక ఇంట్లో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి ఇస్తామని మాట మార్చారు. కేవలం 44 లక్షల మందే లబ్ధిదారులుగా చూపించారు. మొదటి సంవత్సరం రూ.15 వేలు అమ్మఒడి డబ్బులు వేస్తే, రెండో సంవత్సరం వేయి తగ్గించి రూ.14 వేలు వేశారు. మరో సంవత్సరం రూ.13 వేలకు తగ్గించారు. 2021-22 సంవత్సరానికి పూర్తిగా ఎగ్గొట్టారు. మొత్తం వైసీపీ పాలనలో అమ్మఒడి పథకానికి రూ.19,600 కోట్లు వెచ్చిస్తే, మద్యపాన నిషేధం అని చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ పథకం "నాన్నబుడ్డీ" పథకం కింద కల్తీ మద్యం అమ్మి రూ. లక్ష కోట్లు ఆర్జించింది. ఇది వైసీపీ ప్రభుత్వం చేసే న్యాయం. ఈ ముఖ్యమంత్రి సారా వ్యాపారి ఇసుక వ్యాపారిభూ బకాసురుడు. అన్ని విధాలా రాష్ట్రాన్ని నాశనం చేసిన పాలకుడు.

అనకాపల్లి కోడిగుడ్డు గతంలో అనకాపల్లి బెల్లానికి ప్రపంచవ్యాప్తంగా పేరుండేది. అయితే ఇప్పుడు కోడిగుడ్డు ఫేమస్. కోడిగుడ్డు మంత్రి తన హయాంలో కట్టుకథలు చెప్పడం తప్పితే, కిలోమీటరు రోడ్డు వేయలేకపోయారు. 2018లో జనసేన పోరాట యాత్రలో భాగంగా అనకాపల్లి నియోజక వర్గంలోని తుమ్మపాల షుగర్ ఫాక్టరీకి వెళ్లాను. స్థానికులంతా షుగర్ ఫాక్టరీ తెరిపించాలని కోరారు. దీనివల్ల వారికి ఉపాధి మెరుగవుతుందని చెప్పారు. ఇప్పటి ముఖ్యమంత్రి అప్పట్లో పాదయాత్ర చేసి ఈ చక్కెర కర్మాగారాన్ని అభివృద్ధి చేస్తాను అని చెప్పారు. అధికారం వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం ఈ షుగర్ ఫాక్టరీని రూ.300 కోట్లకు రియల్ ఎస్టేట్ వారికి అమ్మేయాలని పన్నాగం పన్నింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సహకార షుగర్ ఫాక్టరీల గురించి ఆలోచిస్తాం. ఖచ్చితంగా వాటిని బతికించేలా, మళ్లీ లాభాల బాటలోకి తీసుకెళ్లేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

**అనకాపల్లి బెల్లాన్ని టి.టి.డి.వాళ్ళు ఎందుకు తీసుకోవడం లేదు?**

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు ఈ ప్రాంతానికి వరం. కొణతాల రామకృష్ణ వంటి నాయకులు ఇలాంటి గొప్ప ప్రాజెక్టు ఆవిష్కరణకు తోడ్పడ్డారు. అయితే ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేసే ఈ ప్రాజెక్టుకు వైసీపీ ప్రభుత్వం రూ.5 కోట్లు విదిల్చింది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు కనీస ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వంలో నిధులు వెచ్చించి, ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేలా కృషి చేస్తాం. అనకాపల్లి బెల్లానికి గ్లోబల్ ట్యాగ్ వచ్చేలా చూస్తాం. మార్కెటింగ్ సదుపాయాలను విస్తృతం చేయడమే కాకుండా, తిరుమల శ్రీవారి ప్రసాదాలకు బెల్లం వాడేలా చర్యలుంటాయి. వైసీపీ రాక ముందు ఇక్కడి నుంచి టీటీడీ బెల్లాన్ని తీసుకొనేది. ఇప్పుడు ఎందుకు తీసుకోవడం లేదు? అనకాపల్లి బెల్లం ప్రయోజనాలను విస్తృతం చేసి, దాని ఎగుమతులు పెరిగేలా చేస్తాం. చెరకు ఎక్కువగా పండే ఈ ప్రాంతంలో ఇథనాల్ తయారీ పరిశ్రమలను ప్రోత్సహిస్తే నరేంద్ర మోడీ గారి విజన్ 2047 ప్రణాళికకు అనుగుణంగా ముందుకు వెళ్లవచ్చు. ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చు. అనకాపల్లి ప్రాంతానికి కోడిగుడ్డు ప్రభుత్వం, కోడిగుడ్డు నాయకులు కావాలా? లేక సుస్థిరమైన ప్రభుత్వం కావాలా అన్నది ప్రజలు ఆలోచించాలి.

**ప్రజల కోసం బాధ్యతతో పని చేస్తాం**

పాలనలో జవాబుదారీతనం తీసుకురావడమే కాదు, ప్రజల కోసం ఒళ్లొంచి, బాధ్యతతో పని చేస్తాం. అధికారాన్ని బాధ్యతగా తీసుకుంటాం. ప్రజలు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తాం. విస్సన్నపేట ప్రాంతంలో 600 ఎకరాలకు పైగా భూములను దోచుకున్న కోడిగుడ్డు మంత్రులను చట్టం ముందు నిలబెడతాం. శ్రీ నరేంద్ర మోదీ గారి 2047 విజన్‌కు తగినట్లుగా యువతలో పూర్తిస్థాయి నైపుణ్యాన్ని పెంచేందుకు తగిన విధంగా ప్రయత్నాలు చేస్తాం. యువత అభిరుచి, వారి ఆసక్తి, ప్రతిభ, సమర్థతపై సర్వే చేయించి దానికి అనుగుణంగా వారికి తగిన నైపుణ్యాలు అభివృద్ధి చేసేలా ప్రణాళికలు ఉంటాయి. రాష్ట్రాన్ని స్కిల్ డవలప్మెంట్ హబ్‌గా తీర్చిదిద్ది భవిష్యత్తు అవసరాలకు యువతను సంసిద్ధం చేస్తాం.

**అనకాపల్లి సమస్యలపై ప్రధాన దృష్టి**

గత వైసీపీ హయాంలో అనకాపల్లి సమస్యలు ఏ మాత్రం తీరలేదు. కనీస సౌకర్యాలు దగ్గర నుంచి మౌలిక వసతుల ఊసే లేదు. అనకాపల్లి నూకాలమ్మ తల్లి జాతరను రాష్ట్ర పండుగగా వేడుకగా నిర్వహించే బాధ్యత తీసుకుంటాం. పిఠాపురంలో గెలిచిన తరవాత ఆ తల్లి దీవెనలు అందుకొని ప్రమాణస్వీకారానికి వెళ్తాను. ఎస్ఈజడ్ లో పని చేసేందుకు స్థానిక యువతకు నైపుణ్యం పెంచుతాం. ఇక్కడ 7 వేల మంది బీటెక్ పట్టభద్రులు ఉంటే, కేవలం 1300 మందికే ఉపాధి దక్కింది. స్థానిక యువతలో స్కిల్స్ పెంచి ఎస్ఈజడ్‌లలో ఉపాధి లభించే ఏర్పాటు చేస్తాం. శారదా నది తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం. సహకార విద్యుత్ సంస్థలను మళ్లీ స్వతంత్రంగా తీర్చిదిద్దుతాం. ఉద్యోగాల పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టిన వారిని వదిలేది లేదు. బొజ్జన్నకొండను బుద్దిస్ట్ సర్క్యూట్‌గా ప్రాంతాన్ని తీర్చిదిద్దవచ్చు. దానిపై ప్రణాళికలు రూపొందిస్తాం. టిడ్కో ఇళ్లు స్థానిక లబ్ధిదారులకు పంచేలా చూస్తాం. డంపింగ్ యార్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం ఆలోచిస్తున్నాం. స్థానిక ఆస్పత్రి నుంచి రోజూ వైజాగ్‌కు రిఫరల్స్ లేకుండా ఈ ఆస్పత్రి సమస్యలను పూర్తిగా తొలగించే బాధ్యత తీసుకుంటాం. వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ భవనాలను తాకట్టు పెట్టడం తప్ప కొత్త భవనాలను కట్టింది లేదు. కూటమి ప్రభుత్వంలో కొత్త జిల్లాల్లో అద్దె భవనాలు లేకుండా, శాశ్వత భవనాలను కట్టేలా చొరవ తీసుకుంటాం.

కశింకోటలో శారద నదిపై వంతెన మధ్యలోనే ఆగిపోయింది. వంతెన పూర్తి చేశాకే ఓట్లు అడుగుతానని కోడుగుడ్డు మంత్రి అప్పట్లో చెప్పారు. ఇప్పుడు వైసీపీ వాళ్ళు ఓట్లు అడగడానికి వస్తే, వంతెన సంగతి ఏంటని నిలదీయండి. ల్యాండ్ పూలింగ్ పేరిట పేదల భూములు సేకరించారు. వారికి సరైన నష్టపరిహారం ఇప్పటి వరకు ఇవ్వలేదు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం. కొణతాల గారు మంత్రిగా ఉన్న సమయంలో సంతోషిమాత ఆలయం వద్ద రైతు బజారు ఏర్పాటు చేశారు. దానిని వైసీపీ ప్రభుత్వం వినియోగంలోకి తీసుకురాలేకపోయింది. దానిని పునరుద్ధరించడంతో కొత్త రైతు బజారును ఏర్పాటు చేస్తాం. ఆసియాలో బెల్లం ఎగుమతులకు అనకాపల్లి ఫేమస్. కానీ.. అదే బెల్లంపల్లి ఇప్పుడు సంక్షోభం వైపు నడుస్తోంది. అనకాపల్లి బెల్లానికి పూర్వవైభవం తీసుకొస్తాం. అన్నమయ్య ఉద్యానవనం, పరమేశ్వరి, గాంధీనగర్, రఘురాం కాలనీల్లో ఉద్యానవనాలు, పార్కులను నిర్మిస్తాం. యువత కోసం ప్రత్యేక క్రీడా స్థలాలు, పెద్దలకు వాకింగ్ ట్రాక్ లు నిర్మిస్తాం. టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణమండపం నిర్మిస్తాం. వైసీపీ ప్రభుత్వ హయంలో అన్ని అర్హతలు ఉన్న పెన్షన్లు, రేషన్ కార్డులు తీసేశారు. అవన్నీ పునరుద్దరిస్తాం. అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తాం. పూడిమడక, చోడవరం రహదారులతో పాటు అంతర్గత రహదారులు అన్ని పెద్ద పెద్ద గుంతలతో చిధ్రంగా మారాయి. వాటన్నింటికి మరమ్మతులు చేస్తాం. అక్రమ మైనింగ్‌కు అనకాపల్లి నియోజకవర్గం అడ్డాగా మారింది. అనకాపల్లి ఏడీ పరిధిలో వందల క్వారీలు ఉండగా పదుల సంఖ్యలో క్వారీలకు మాత్రమే పర్యావరణ అనుమతులు ఉన్నాయి. ఈ అక్రమ క్వారీలన్నీ స్థానిక నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నాయి. అక్రమ క్వారీల వల్ల స్థానిక ప్రజల్లో కిడ్నీ సమస్యలు తలెత్తున్నాయి. వాటన్నింటిని అధికారంలోకి రాగానే మూసేస్తాం.

**25 వేల కిలోల డ్రగ్స్ పాలకుల ప్రమేయం లేకుండా వచ్చాయా?**

ఇటీవల విశాఖ పోర్టులో బయటపడిన 25 వేల కిలోల డ్రగ్స్ వైసీపీ పాలకులకు తెలియకుండా, ప్రమేయం లేకుండా వచ్చే అవకాశం లేదు. వైసీపీ పాలన మొదలయ్యాక రాష్ట్రం పూర్తిగా డ్రగ్స్‌తో నిండిపోయింది. ఇలాంటి క్రిమినల్ ప్రభుత్వం వద్దు అనే - ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా తగిన విధంగా కూటమితో ముందడుగు వేశాను. ఆంధ్రప్రదేశ్ ను మళ్లీ పూర్తిస్థాయి కట్టుదిట్టమైన రాష్ట్రంగా, శాంతిభద్రతలు చక్కగా అమలు అయ్యేలా తగిన బాధ్యతను తీసుకుంటాం. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ను సాధిస్తాం. సీపీఎస్ రద్దు కోసం ప్రభుత్వ ఉద్యోగులు మా కూటమి ప్రభుత్వ ప్రణాళికను అడుగుతున్నారు. కచ్చితంగా ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం లోగా సీపీఎస్ రద్దు విషయంలో తగిన నిర్ణయం తీసుకుంటాం. మేధావులతో, నిపుణులతో చర్చించి ఉద్యోగులకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటామని ఓ ప్రభుత్వ ఉద్యోగి కొడుకుగా మాట ఇస్తున్నాను.

**అవినీతిలో అధినేతను మించాడు**

వైసీపీ అధినాయకుడే అవినీతిపరుడు అనుకుంటే ఈ కోడిగుడ్డు నాయకుడు అవినీతిలో వాళ్ల అధినాయకుడినే మించిపోయాడు. ఈయన అవినీతికి చూసి వాళ్ల నాయకుడే ఇక్కడ టికెట్ కూడా కేటాయించలేకపోయాడు. కొండల్ని కొల్లగొట్టి మట్టి, కంకర అమ్ముకోవడంలో సిద్ధహస్తుడు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించి కమీషన్లు మింగడంలో ఈయన అనుచరులు దిట్ట. కశింకోట మండలంలో విస్సన్నపేట గ్రామంలో తన బినామీలతో వందల ఎకరాలను కాజేశాడనే ఆరోపణలు ఉన్నాయి. అర్హతకు సంబంధం లేకుండా పదుల సంఖ్యలో యువకుల దగ్గర రూ. 6 లక్షల చొప్పున తీసుకొని గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ(ఆర్ఈసీఎస్)లో ఉద్యోగాలు ఇప్పించారనే ఆరోపణలు ఉన్నాయి. కోవిడ్ సమయంలో రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి బంజర భూములను జిరాయితీ భూములుగా మార్చేసి అమ్మేశారు. జాతీయ రహదారిని పక్కన ఉన్న గ్రామాల్లో ఇనాం భూములు, అసైన్డ్ భూములను దోచేశారు. జగనన్న కాలనీల కోసమని రైతుల దగ్గర తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి వాటిన అధిక ధరలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. మంత్రి అనుచరులు చాలా మంది క్రికెట్ బెట్టింగ్, మైనింగ్ మాఫియాకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముందుగా మంత్రి బినామీల భరతం పడతాం. ప్రజల వద్ద దోచుకున్న సొత్తును చివరి రూపాయితో సహా కక్కిస్తాం.

**పోలవరం గురించి అడిగితే రోడ్డు మీద డ్యాన్సులు వేస్తాడు**

ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం. సంబంధిత మంత్రి కి దాని గురించే మాట్లాడే సత్తా, సమర్థత లేదు. డ్యాన్సులు చేయమంటే మాత్రం రోడ్ల మీద డ్యాన్సులు కడతాడు. కేంద్రం సహాయ సహకారాలతోనే పోలవరం సాధ్యమవుతుంది. అందుకే అనకాపల్లి పార్లమెంట్ సీటు మొదట జనసేనకు కేటాయించినా... బీజేపీ అడగడంతో త్యాగం చేశాం. బీజేపీ తరఫున సీఎం రమేష్ ఇక్కడ నుంచి పోటీ చేస్తున్నారు. వారిని గెలిపిద్దాం. ఆయన మన గొంతును బలంగా పార్లమెంటులో వినిపించేలా చేద్దాం. వైసీపీ నాయకుల్లా మేము పోలవరాన్ని రెండు నెలల్లో పూర్తి చేస్తాం... మూడు నెలల్లో పూర్తి చేస్తాం అని చెప్పము. సాధ్యమైనంత తక్కువ కాలంలో పూర్తయ్యేలా కృషి చేస్తాం. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ ఆంధ్రప్రదేశ్ ప్రజల భావోద్వేగాలతో ముడిపడింది. దీన్ని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుందాం. కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు అన్ని బలంగా నిలబడితే ప్రైవేటీకరణ కాకుండా కాపాడే బాధ్యత తీసుకుంటాం. ఇక్కడ నుంచి సీఎం రమేష్ ను గెలిపించుకుంటే ఆయన జాతీయ నాయకులతో మాట్లాడి సొంత గనులను కేటాయించేలా చేస్తారు. కూటమి తాలుకా లక్ష్యం, కోరిక కూడా అదే. కచ్చితంగా ప్రజాభివృద్ధి పాలనకు కూటమి ప్రభుత్వంలో ముందడుగు పడుతుంది. కూటమిని ప్రజలంతా నిండు మనసుతో ఆశీర్వదించాలి.

జనసేన పార్టీకి 50 స్థానాల్లో పోటీ చేసే సత్తా ఉన్నా 21 స్థానాలు మాత్రమే తీసుకున్నాం. తీసుకున్న 21 స్థానాల్లో కూడా బలమైన నాయకులను పోటీకి పెట్టాం. ఒక్కో నాయకుడు అసెంబ్లీని గడగడలాడించే నాయకుడు. అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న కొణతాల రామకృష్ణ అలాంటి నాయకుడే. అలాంటి నాయకులను గెలిపిస్తే ఉత్తరాంధ్ర గళాన్ని అసెంబ్లీలో బలంగా వినిపించగలరు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా కూటమి తమ అభ్యర్థులను నిలబెడుతోంది. వారిని గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ ను రక్షించే బాధ్యత, అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకుంటాము. పిఠాపురంలో గెలిచిన తరవాత, ప్రమాణ స్వీకారానికి ముందు నూకాలమ్మ తల్లి ఆశీర్వాదం తీసుకుని వెళ్తాను. రాజకీయాల్లో జవాబుదారీతనం తీసుకొస్తాను. కూటమి ప్రజలకు జవాబుదారీ గా ఉంటుంది" అన్నారు.

## మిసిమి

చింతనాత్మక సారస్వతం



### విశిష్ట విమర్శకులు
## ఆచార్య ఎస్.వి. జోగారావు

– వెలమల సిమ్మన్న

(నిన్నటి తరువాయి)

మనిషికీ మనిషికీ, మనసుకూ మనసుకూ మధ్య అడ్డుగోడలు వేయడం వల్ల వాని మధ్య స్నేహసేతువులు నిర్మించినచో, జగత్తంతయు భగవంతుని కళ్యాణ మండపమగును. ఆ పనినే చేసి చూపినాడు భట్టబాణుడు. ఇప్పటికి లోకములో ఏ మహాకవులు మానవజాతి కింతటి మహత్తర సందేశమునందించి యుండలేదు. సంస్కృత కవుల చేతను వివిధ భాషా కవుల చేతను ఇంతటి అనుకార్యుడును ప్రశంసాపాత్రుడును అయిన కవి మరిలేడు. కాదంబరీ కావ్యం గురించి 1960 ప్రాంతంలోనే అనేక వ్యాసాలు వ్రాశాను. "భారతి" మొదలగు పత్రికలలో ప్రకటించాను. అప్పటికెవ్వరూ తెలుగులో "కాదంబరి" గురించి ఒక్కముక్క వ్రాసిన జాడ కానరాదు. కాని ఆ వ్యాసాలన్నీ నేడుపలబ్ధముకాలేదు. దొరికిన వానిని నా షష్టిపూర్తి కానుకగా ప్రకటించాను" అని జోగారావుగారు వెల్లడించారు. రావుగారు తన శిష్యులతో తరుచూ కాదంబరి గూర్చి చర్చించేవారు అంతే 5. "Read Kadambari and die" ?. కాదంబరి కావ్యంపై ఎనలేని మక్కువ కలవారు రావుగారు.

"కాదంబరి" కావ్యంలో కపింజలుడు పుండరీకుడు, పుండరీకుడు మహాశ్వేత, మహాశ్వేత కాదంబరి, కాదంబరి చంద్రాపీలుడు, చంద్రాపీలుడు పత్రలేఖ ఇలా వివిధ జంటలమధ్య ఒక్కొక్క విధమైన స్నేహసూత్రం చోటు చేసుకుంది. ఒక జంటకు మరో జంటకు మధ్య అనుస్యూతత్వం నెలకొల్పి ఆబంధాల్లోనూ, అనుబంధా ల్లోనూ వైవిధ్యాన్ని ఏక సూత్రతను కూడా సందర్శించి స్నేహధర్మం యొక్క విశ్వరూపాన్ని ప్రదర్శించి లోకానికి ఒక లోకోత్తర సందేశాన్ని అందజేసిననాడు భట్టబాణుడు. అందుకే ఇతని కావ్యం ప్రపంచ మహాకావ్యాల్లో ఒకటిగా

నిలిచింది. 7. మణి ప్రవాళం : ఆచార్య యస్వీ జోగారావు గారు రాసిన "మణిప్రవాళం" అనే వ్యాససంపుటి 1989లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. ఈ గ్రంథం 2 అక్టోబర్, 1988లో వెలువడింది. పేజీలు 204. మూల్యం 25/- రూ. ముద్రణ శ్రీపతి ప్రెస్, కాకినాడ. పైడా శ్రీరామకృష్ణమూర్తి గారికి అంకితం ఇచ్చారు. తొలిపలుకు పి.యస్.ఎమ్.సంస్కృత కళాశాల కాకినాడ ప్రముఖ న్యాయవాది వడ్లమాని వేంకట రమణ గారు రాశారు. "గురునివేదన" అనే పేరుతో డాక్టర్ లకంసాని చక్రధరరావు గారు ముందు మాట రాశారు.

మణులు పగడాలతో కూర్చిన దండను "మణి ప్రవాళం" అని అంటారు. ఇందులో భిన్నమైన ప్రక్రియలకు చెందిన వ్యాసాలు వున్నాయి. అంచేత దీన్ని జోగారావుగారు "మణి ప్రవాళం" అనే శీర్షిక పెట్టారు. "మణి ప్రవాళం" అనే శైలికూడా వుంది. సంస్కృతాంధ్రాల్ని మేళవించి రాసే పద్యాన్ని "మణిప్రవాళం" అని కూడా అంటారు.

వీరి రచనలు తెలుగు సరస్వతికి అమూల్యాభరణాలు, ఈ వ్యాసాలన్నీ సహృదయ పాఠకులకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి. రావుగారు పద్య రచనలో ఎంత సమర్థులో, వచన రచనలోనూ అంత సిద్ధ హస్తులు. జోగారావు గారు ఎంత ప్రాచీనులో, అంత నవీనులు దానికి "మణి ప్రవాళం" అనే గ్రంథం ప్రబలనిదర్శనం. తెలుగు భాషా సాహిహిత్యాభిమానులందరూ తప్పని సరిగా చదవి ఆనందించవలసిన వ్యాస సంపుటి ఇది. వీరి రచనల్లో అతి ముఖ్యమైంది. "మణి ప్రవాళం".

ఈ సంపుటిలో 21 వ్యాసాలు వున్నాయి. అవి ఇవి. 1) విశ్వనాథ వారి మేనకా విశ్వామిత్రం 2) రాయప్రోలు వారి వైమర్శిక దృక్పథం 3) కృష్ణ శాస్త్రి 4) శ్రీశ్రీకి శ్రద్ధాంజలి 5) అనంత కృష్ణుడు 6) శర్మగారి ధన్యజీవితం 7) ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ నిర్మాత కీ. శే. మల్లంపల్లి సోమశేఖర శర్మ, 8) విద్యారణ్య మహత్వ భూమిక 9) సర్వాంధ్ర 10) నేదునూరి గంగాధరం గారి "సెలయేరు" పీఠిక 11) పాతికేళ్ళ తెలుగు కవిత్వం 12) తెలుగు నవల తీరుతెన్నులు 13) తరతరాల.. తెలుగు భాష, 14) ప్రక్రియా వైవిధ్యాన్ని, పరిణతిని ప్రదర్శించిన దక్షిణాంధ్రసాహిత్యం 15) జక్కన కవితా ప్రస్థానం 16) సూరన ప్రతిభ - ఆర్వాచీన కవులపై అతని ప్రభావం 17) దేవుని దస్తూరి 18) ఆధునిక కవితా ధోరణులు 19) ఆంధ్ర విశ్వకళాపరిషత్స్వర్ణోత్సవ సారథి 20) కవిసన్మానం 21) ఆంధ్ర సారస్వత శాఖలో యక్షగానం ప్రత్యేకత. "తరతరాలు.... తెలుగు భాష" అనే వ్యాసంలో తెలుగు జాతి గొప్పతనం గూర్చి, తెలుగు భాష వైశిష్ట్యం గూర్చి తెలియజేశారు. ఆంధ్రం, తెలుగు, తెనుగు పదాలు గూర్చి విశ్లేషించారు. "జననిసమస్త భాషలకు సంస్కృతం" అనీ, తెలుగు సంస్కృత జన్యం అనీ, కొందరి పండితుల్లో పాతుకుపోయిందని విమర్శించారు. పాశ్చాత్య భాషా శాస్త్ర పండితుల పరిశోధన వల్ల నిజాలు బయట పడ్డాయని విపులీకరించారు. తెలుగు భాష సంస్కృతంతో సంబంధం వున్నప్పటికీ, అది జన్య జనక సంబంధం కాదని వివరించారు. తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందినదని చెప్పారు. మూల ద్రావిడ భాషనుండి క్రమ క్రమంగా తమిళం, కన్నడం, తెలుగు, మళయాళం, విడిపోయాయని తెలియజేశారు.

## వేసవిలో ఐదు చోట్ల చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తాం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పట్టణం లో ఐదు చోట్ల చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ తెలిపారు. శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా పట్టణంలోని నూకాం బిక అమ్మవారి ఆలయం వద్ద దాడి ఇన్స్టి ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని సోమవారం దాడి రత్నాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమ్మవారి జాతర పురస్కరించుకుని దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేస్తారన్నారు. ఇప్పటికే ఎండల తీవ్రతతో ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోయాయన్నారు. వడగాడ్పులు కూడ వీస్తున్నాయన్నారు. జాతర సందర్భంగా విచ్చేస్తున్న భక్తులు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడ ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కేంద్రం ఉగాది సందర్భంగా రేపు కూడ నిర్వహిస్తామని చెప్పారు. ఇకపై ఆదివారం పూర్తిస్థాయిలో ఇక్కడ మజ్జిగ పంపిణీ జరుగుతుందని చెప్పారు. వేసవి రెండు నెలల కాలంలో పట్టణంలో ఐదు చోట్ల వేసవి శిబిరాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. డ్కెట్ కాలేజ్ ఎదురుగా జాతీయ రహదారిపై ప్రయాణికులకు చల్లని తాగునీటిని అందించేందుకు వేసవి శిబరాన్ని ప్రారంభించామన్నారు. జాతీయ రహదారిపై గల నూకాంబిక అమ్మవారి ముఖద్వారం వద్ద వేసవి చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉగాది సందర్భంగా పట్టణంలోని చోడవరం బస్టాప్ వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రాన్ని రేపటినుంచి ప్రారంభిస్తామన్నారు.

ఈ కేంద్రాల ఏర్పాటులో ఇప్పటికే సంస్థలు, ప్రజలను భాగస్వాములను చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ భక్తులకు, ప్రజలందరికి కొత్త అమావాస్య జాతర మరియు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దాడి ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్.ఎస్.ఎస్. యూనిట్ కన్వీనర్ సుధీర్, ఎన్.ఎస్.ఎస్. టీమ్ సభ్యులు, మాజీ కౌన్సిలర్ కోటిపల్లి జేజిబాబు, యింటి త్రినాథ్, మొల్లి రమణబాబు, కోటిపల్లి శ్రీను, మళ్ల రామచంద్రరావు, గాజుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి జాతర నెల రోజులు పాటు జరగనున్న సందర్భంగా ఆలయాన్ని జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దర్శించుకుని, ఆలయ పరిసరాలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్ తదితర సంబంధిత అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎస్.అప్పలరాజు, అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ జి.శంకర రావు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పి.పైడపు నాయుడు మరియు దేవస్థానం ఈవో బండారు ప్రసాద్ లకు భద్రతాపర మైన సూచనలు చేశారు.

నెలరోజుల పాటు జరిగే అమ్మ వారి జాతర సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేప థ్యంలో పటిష్ట బందోబస్తు నిర్వ హించాలని, విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి బ్రీఫింగ్ చేసి, విధులు అప్పగించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడా లని, ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించకూడదని సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో దృష్టి పెట్టాలని, దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా వుండాలని చెప్పారు. భక్తులకు ఎప్పటికప్పుడు పబ్లిక్ అడ్రెస్సింగ్ సిస్టం ద్వారా హెచ్చరికలు జారీ చేయాలని తెలిపారు. రద్దీ వున్నప్పుడు తోపులాట జరగ కుండా చూడాలని సిబ్బంది అప్రమత్తంగా వుండాలన్నారు. విధి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యంగా వుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

## పోషకాల తాటి ముంజలు



ఎండాకాలం వచ్చిందంటే వేడి తాపానికి ఉపశమనం కలిగించే తాటి ముంజలు అందుబాటులో ఉంటాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రజలు వీటిని కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముంజల్లో ఐరన్, క్యాల్షియం, మిటమిన్-ఏ, బీ, సీలతో పాటు జింక్, పొటాషియం, ఫాస్ఫరస్లు అధికంగా ఉంటాయి. ఇవి తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# ఉగాది అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది తెలుగు ప్రజలందరి జీవితాలలో వెలుగును నింపాలని విఎంఆర్డిఏ చైర్మన్ సనపల చంద్రమౌళి ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రైల్వే న్యూకాలని వద్దనున్న షింకా గ్రాండ్ హొటల్లో జర్నలిస్ట్ ల ఉగాది సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ ఉగాది సంబరాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రానున్న ఉగాది పండుగ మన తెలుగు ప్రజలందరి జీవితాల్లో ఆనందాన్ని తీసుకురావాలన్నారు. పాత్రికేయులు వారి కుటుంబ సభ్యులు అంతా ఒకే చోట కలిసి ఉగాది సంబరాలు జరుపుకోవడం ఆనంద దాయకమన్నారు. పాత్రికేయ వృత్తిలో ఉన్న ఒత్తిడులను అధిగమించేందుకు ఇటువంటి సంబరాలు చాలా ఉపయోగ పడతాయన్నారు. పంచాంగ శ్రవణం చేసిన పురోహితులు శర్మ తమ పంచాంగ శ్రవణంలో ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండి రాష్ట్రం, దేశం సస్యశ్యామలంగా ఉంటుందని జోస్యం చెప్పారు. 12 రాశులకు సంబంధించిన రాశి ఫలాలు, ఆదాయ-వ్యయాలు, రాజపూజ్య-అవమానాలను వివరించారు. పల్సర్ బైక్ ఝాన్సీ, ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్ రమేష్ తమ నృత్య ప్రదర్శనలతోను జబర్దస్త్ హాస్య నటుడు రాపెటి అప్పారావు తన హాస్య స్కిట్లతో అహూతులను అలరించారు.మౌనిక ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన పలు నృత్య ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం జర్నలిస్టుల కుటుంబాల్లోని మహిళలకు చీరలు, పంచాంగాలు పంపిణీ చేశారు.. గౌరవ అతిధులు గా మట్ట పల్లి హనుమంతరావు, సింకా జర్నలిస్ట్ లకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు..కార్యక్రమం కి జాతీయ జర్నలిస్ట్ ల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమాజం కోసం శ్రమించే జర్నలిస్ట్ లు, వారి కుటుంబ సభ్యులు ఎప్పుడు సంతోషమయమైన జీవితం గడపాలని,ఉగాది ఆనందమయం కావాలని ఆ సింహాద్రి నాధుడుని కోరు కుంటున్నానన్నారు.. అన్ని పండుగలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. అర్బన్ అధ్యక్షులు పి. నారాయణ మాట్లాడుతూ అందరి సహకారం తో తమ యూనియన్ లు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. జాతీయ కార్య వర్గ సభ్యులు జి. శ్రీనివాస్ రావు, బ్రాడ్ కాస్ట్ అర్బన్ అధ్యక్షులు ఈరోతి ఈశ్వర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ లు డి. రవి కుమార్, సాంబ శివరావు బందరు శివప్రసాద్, కోశాధికారి మూర్తి,. సీనియర్ జర్నలిస్ట్ లు అర్. నాగరాజ్ పట్నాయక్, కిల్లి ప్రకాష్ రావు, ఆనంద్,ఆయా ప్రాంతాల జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

## నారాయణ్ సేవా సంస్థాన్ యొక్క గ్రాండ్ కృత్రిమ అవయవాల కొలతల శిబిరం





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నారాయణ్ సేవా సంస్థాన్ ఉదయ్‌పూర్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని పోర్ట్ స్టేడియంలోని విశ్వనాథ్ కన్వెన్షన్, కళావాణి ఆడిటోరియం ఆవరణలో ఆదివారం ఉచిత 'దివ్యాంగ్ డయాగ్నోసిస్, ఆపరేషన్ సెలక్షన్, నారాయణ్ లింబ్ & కాలిపర్ మెజర్‌మెంట్ క్యాంపు' నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, గీతం యూనివర్సిటీ చైర్మన్ భరత్ కుమార్, రాష్ట్రీయ స్వయంసేవక్ కె.వెంకట్ రమణ జ్యోతి ప్రజ్వలన చేసి విశాఖపట్నంలోని వికలాంగులు, వారి కుటుంబసభ్యులు, గౌరవనీయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉచిత శస్త్రచికిత్సలు, కృత్రిమ అవయవాల పంపిణీ, 5000 మందికి రోజువారీ భోజనం, గురుకుల నిర్వహణ, 600 మంది కార్మికుల ఆర్థికంగా వెనుకబడిన పిల్లల కోసం నారాయణ్ చిల్డ్రన్ అకాడమీ స్కూల్ నిర్వహణ, కంప్యూటర్లు, మొబైల్ రిపేర్‌లలో వృత్తి శిక్షణ ఇవ్వడంతో సహా సంస్థాన్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను మాజీ ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు అభినందించారు. , వందలాది మంది వికలాంగులకు టైలరింగ్ మరియు మెహందీ దరఖాస్తు, మరియు వారు ఇళ్లలో స్థిరపడేందుకు సామూహిక వివాహాలను సులభతరం చేయడం. వికలాంగులను శారీరకంగా, సామాజికంగా, ఆర్థికంగా మరియు మేధోపరంగా శక్తివంతం చేయడంలో నారాయణ్ సేవా సంస్థాన్ చేస్తున్న ప్రశంసనీయ ప్రయత్నాలకు ఆయన ప్రగాఢమైన అభినందనలు తెలిపారు. విశాఖపట్నంలోని వికలాంగుల ప్రయోజనాల కోసం సంక్షేమ కార్యక్రమాలకు పూర్తి మద్దతునిస్తానని హామీ ఇస్తూ, సంస్థాన్ వ్యవస్థాపకుడు కైలాష్ 'మానవ్' మరియు అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. గీతం యూనివర్శిటీ చైర్మన్ & విశాఖపట్నం ఎంపీ టీడీపీ పోటీదారు శ్రీ భరత్ పాల్గొని, వికలాంగులతో సంభాషించారు మరియు భవిష్యత్తులో నారాయణ్ సేవా సంస్థాన్‌కు తన మద్దతు ఉంటుందని వారికి హామీ ఇచ్చారు.ప్రారంభంలో, సంస్థాన్ మహాగంగోత్రి అధిపతి రజత్ గౌర్ ముఖ్య అతిథులకు మరియు ప్రముఖ అతిథులకు పారిశ్రామికవేత్త అశోక్ మంధానే, ప్రముఖ సామాజిక కార్యకర్త మరియు బిజెపి ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ శర్మ, ఉత్కళ సమాజ్ అధ్యక్షుడు జెకె నాయక్, లయన్స్ ప్రెసిడెంట్ ఎంఎం మహేష్ మాల స్వాగతం పలికారు. , వనవాసి కళ్యాణ్ ఆశ్రమ కార్యదర్శి సుభద్రరావు, అగర్వాల్ మహాసభ అధ్యక్షుడు విజేంద్ర గుప్తా, సామాజిక కార్యకర్త ఖేత్‌సింగ్ రాజ్‌పురోహిత్, విష్ణు సేవా సంఘం సభ్యులు, జబర్ సింగ్ చౌహాన్, సుమన్ ప్రకాష్, సురేష్ అగర్వాల్, సురేఖా పట్నాయక్, హరిహర్ రావు, కృష్ణ సింగ్ రాజ్‌పురోహిత్, శంకర్‌లాల్ శర్మ, అశోక్ అగర్వాల్ , విదిషా బోయ్స్, సన్‌మూర్తి మేవార్ ప్రాంతం నుండి ఆతిథ్య సంప్రదాయాన్ని అనుసరించి వేదికపై కూర్చున్నారు. సంస్థాన్ యొక్క 39 సంవత్సరాల అంకితమైన సేవ గురించి అంతర్దృష్టులను అందజేస్తూ, వారు రాబోయే 5 సంవత్సరాల కోసం ఒక విజన్‌ని అందించారు.ఈ శిబిరంలో సేవాభారతి, వనవాసి కళ్యాణ్ ఆశ్రమం, గుజరాతీ సొసైటీ, మార్వాడీ సంఘం, ఆల్ ఇండియా మార్వాడీ సంఘం, రాజస్థాన్ సంస్కృత మండల్, కచ్ కేడియా పాటిదార్ సొసైటీ, మార్వాడీ యూత్ ఫోరం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం, లయన్స్ వంటి వివిధ స్థానిక సంస్థలు క్లబ్, రోటరీ క్లబ్, అగర్వాల్ మహాసభ, మహావీర్ ఇంటర్నేషనల్, ఆరోహన్ ట్రైబల్ సొసైటీ, ఒడియా (ఉత్కల్) సొసైటీ, గాయత్రి పరివార్, శ్రీ విష్ణు సేవా ఛారిటబుల్ ట్రస్ట్, రేంజర్ ఫోర్స్ ఛారిటబుల్ ట్రస్ట్, విప్రా ఫౌండేషన్, ఖండేల్ విప్రా అసోసియేషన్, గణేష్ పూజ కల్చరల్ అసోసియేషన్, శ్రీ సత్య సాయి సేవా సమితి, సమృద్ధి ఫౌండేషన్, యూత్ ఇండియన్ ప్రజ్వల్ వాణి కళ్యాణ్ సమాజ్, జేసీఐ వైజాగ్ ఎక్సలెన్స్, వైజాగ్ వాలంటీర్స్ అసోసియేషన్ తదితర సంస్థలు స్వచ్ఛందంగా తమ సేవలను అందించాయి. ఈ శిబిరంలో విశాఖపట్నం నుండి 100 మందికి పైగా సభ్యులు మరియు దాతలు పాల్గొన్నారు.రజత్ గౌర్ శిబిర నివేదికను అందజేస్తూ, ఈ రోజు, 700 మందికి పైగా విభిన్న వికలాంగులు శిబిరానికి హాజరయ్యారని పేర్కొన్నారు. సంస్థాన్‌కు చెందిన పీ అండ్ ఓ బృందం వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, 390 నారాయణ్ కృత్రిమ అవయవాలు, 28 కాలిపర్‌లను అమర్చేందుకు కొలతలు తీసుకున్నారు. శస్త్రచికిత్స కోసం సుమారు 50 లేదా అంతకంటే ఎక్కువ మంది భిన్నాభిప్రాయాలు ఉన్న రోగులను కూడా ఎంపిక చేశారు. ఉచిత శస్త్రచికిత్సల కోసం ఉదయ్‌పూర్‌కు తీసుకెళ్లనున్నారు.విశాఖపట్నంలో నిర్వహించే మరో ఫిట్‌మెంట్ క్యాంప్‌లో దివ్యాంగులకు సుమారు 2 నుంచి 3 నెలల తర్వాత కాస్టింగ్ మరియు కొలతల తర్వాత నారాయణ్ అవయవాలను అందజేస్తామని క్యాంపు ఇన్‌ఛార్జ్ హరిప్రసాద్ లడ్డా పేర్కొన్నారు. సంస్థాన్ రూపొందించిన ఈ కృత్రిమ అవయవాలు అధిక నాణ్యత, తేలికైనవి మరియు మన్నికైనవి. ఈ శిబిరానికి విశాఖపట్నం పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, తిరుపతి, విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు జిల్లాల నుంచి రోగులు హాజరయ్యారు. ఈ శిబిరం యొక్క విజయానికి సంస్థాన్ యొక్క 25 మంది సభ్యుల బృందం యొక్క ఐక్యత మరియు కృషి కారణం క్యాంపు విజయవంతం చేసినందుకు జస్బీర్ సింగ్, లాల్ సింగ్ భాటి కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరాన్ని మహిమ్ జైన్ సమన్వయం చేశారు.

# బాణాల వారి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది పంచాంగం



పంచాంగ కర్త: బ్రహ్మశ్రీ బాణాల దుర్గాప్రసాదాచార్యులు సిద్ధాంతి మురమళ్ల సెల్: 9908781266

**మేషరాశి ఫలితములు:-** ఆదాయం:-8, వ్యయం:-14, పూజ్య త:-4,అవమానం:-3. అశ్విని, 1,2,3,4(పా) భరణి, 1,2,3,4,(పా) కృత్తిక 1వ పాదం వారికి 2024 సంవత్సరంలో విశేషముగా ఉన్నది. పనులందు ఆటంకములు కలిగినను సకాలంలో పనులను పూర్తిచేస్తారు. కుటుంబ, ఆర్థిక విషయాలు ఉత్సాహంగా ఉంటాయి. సోదరవర్గము నుండి చిన్నపాటి ఇబ్బందులు తప్పవు. గృహ వాతావరణం కొంత ప్రశాంతంగా ఉంటుంది. సంతానం లేని వారికి సంతాన ప్రాప్తి. శత్రు, కోర్టు వ్యవహారాలు అనుకూల ఫలితాన్ని ఇస్తాయి. భాగస్వామి వ్యాపారాలు కొంత అనుకూలిస్తాయి. ఆకస్మిక ప్రయాణాల వలన ధన లాభ సూచనలు ఉన్నవి.

స్థిరస్తి సంబంధిత వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి చేయువృత్తి, ఉద్యోగము నందు అధికారుల మన్ననలు పొంది ఉన్నత పదవులు పొందుతారు క్రయవిక్రయాలలో జాగ్రత్త వహించడం మంచిది. వ్యవసాయదారులకు రెండు పంటలు కలసివస్తాయి. విద్యార్థులకు తాము ఆశించిన పోటీపరీక్షలయందు విజయాన్ని సాధిస్తారు. కొన్ని రంగాల వారికి నూతన పెట్టుబడులు కలిసి వచ్చి విశేషమైన లాభాలు పొందుతారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది. అన్ని రంగముల వారికి అనుకూలంగా ఉన్నది. ఈ రాశి స్త్రీలకు కూడా ఈ సంవత్సరం చాలా విశేషమైనటు వంటి ఫలితాలు పొందుతారు. ఈ రాశి వారికి 2-3-8-9-11-అనుకూలమైన శుభ ఫలితాల కొరకు గోమాత సమేత ఐశ్వర్య కాళీ అమ్మవారి పటానికి ఎర్రని పూలతో పూజించండి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి, భిక్ష కులకు అన్నందానం చేసిన. శుభం కలుగుతుంది.

**వృషభరాశి ఫలితములు:-** ఆదాయం:-2, వ్యయం:-8, పూజ్య త:-7, అవమానం:-3 కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర 1, 2 పాదాల వారికి 2024 సంవత్సరంలో మిశ్రమంగా ఉన్నది. వ్యాపారములు అభివృద్ధి చెందుతాయి. ఆర్థిక విషయాలు కొంత చికాకు కల్గించినను సంవత్సరాంతమున పూర్తి అవుతాయి. సోదరుల వలన విశేష సహకారము అంది గృహంలో వివాహాది శుభకార్యాలను ఆచరిస్తారు. విదేశీ వ్యవహారాలు అనుకూలిస్తాయి. జీవిత భాగస్వామి వలన కొంత విబేధాలు తప్పవు. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. చేయు వృత్తి, ఉద్యోగము నందు సహెూద్యోగుల సంపూర్ణ సహకారం లభిస్తుంది. పుణ్యకార్యాలతో కొంత ధనాన్ని వెచ్చిస్తారు. వ్యవసాయదారులకు అన్ని పంటలు అనుకూలంగా ఉన్నవి. విద్యార్థులు పరీక్షలయందు ఉత్తీర్ణత సాదిస్తారు. నూతన వ్యాపారాలను ప్రారంభం చేస్తారు.

కొన్ని రంగము వారికి అనుకూలంగా యున్నది. ఈ రాశి స్త్రీలకు కుటుంబమున, సంఘము నందు కీర్తి ప్రతిష్ఠలు ఏర్పడతాయి. శుభకార్య నిర్వహణలు చేస్తారు. ఈ రాశి వారికి 1-2-5-6-9 అదృష్ట సంఖ్యలు, శని,బుధ,శుక్ర సోమవారములు అదృష్ట వారములు, లక్కీ నెంబర్:-6. అనుకూలమైన శుభ ఫలితాల కొరకు కొరకు విష్ణు సహస్ర నామాలను చదువుకోవాలి. పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి. భిక్ష కులకు అన్నందానం చేసినశుభం కలుగుతుంది.

**మిధున రాశి ఫలాలు:-** ఆదాయం:-5, వ్యయం:-5, పూజ్య త:-3, అవమానం:-6. మృగశిర 3, 4 పాదాలు, ఆరుద్ర, పునర్వసు 1, 2, 3, పాదాల వారికి 2024 సంవత్సరంలో శ్రమచేత ఫలితాన్ని సాధించవలసి వచ్చును. నూతన వ్యాపారాలు ప్రారంభం చేయకపోవుట మంచిది. కుటుంబమున మాట విలువ తగ్గుతుంది. ఆర్థికవిషయాలు చికాకులు కల్గిస్తాయి. సోదర, బంధువర్గము వారి నుండి విబేధాలు తప్పవు. కోర్టు, శత్రు సమస్యలు పరిష్కారమవుతాయి. జీవిత భాగస్వామి వలన కలసివస్తుంది. భాగస్వామ్య వ్యాపారాలలో సొంత నిర్ణయాలతో ఆచరించుట మేలు. ఆకస్మిక దూరప్రాంత పుణ్యక్షేత్ర సందర్శనం చేస్తారు.

గతంలో రావలసిన పిత్రార్జితం ఈ సంవత్సరామున చేతికందును. చేయువృత్తి, ఉద్యోగమునందు సమస్యలు ఉన్నను సామాన్యముగా ముందుకు సాగును. వ్యవసాయదారులకు పంటలుపండినను ఆదాయము చేతికి లభించుట కష్టము. విద్యార్థులకు పరీక్షలయందు ఉత్తీర్ణత సాధిస్తారు. రాజకీయ నాయకులకు సామాన్యంగా ఉండును. ఈ రాశివారికి 1-3-6-9 అదృష్ట సంఖ్యలు, ఆది,సోమ,బుధవారములు అదృష్ట వారములు, లక్కీ నెంబర్ (5). ఈ రాశి స్త్రీలకు ఆరోగ్యభంగమగును, జాగ్రత్తగా ఉండటం మంచిది. రాహు కేతు పూజ చేయించాలి. నిత్యం సూర్య నమస్కారములు చేసుకోవాలి. గోచార రిత్యా మీరు అష్టమ శని ప్రభావంతో ఉన్నారు పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి, భిక్ష కులకు అన్నందానం చేసిన. శుభం కలుగుతుంది.

**కర్కాటక రాశి ఫలాలు:-** ఆదాయం:-14, వ్యయం:-2, పూజ్య త:-6, అవమానం:-6. పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష వారికి 2024 సంవత్సరంలో కొంత గడ్డుకాలముగా ఉన్నది. అనుకున్న పనులు సమయానికి పూర్తికాక నిరాశ తప్పదు. కుటుంబ ఆర్థిక విషయాలు అంతంతమాత్రంగా ఉంటాయి. చేసిన పనులే మళ్లీ మళ్లీ చేయవడం వలన చికాకులు తప్పవు. గృహంలో శుభకార్యాలు వాయిదా పడతాయి. సోదరవర్గము నుండి కొంత సహకారము లభిస్తుంది. సంతాన వ్యవహారాలు కొంత సామాన్యంగా ఉంటాయి. కోర్టు వ్యవహారములు వాయిదా పడుతాయి. శత్రు, సమస్యలు ఇతరుల సహకారంతో పరిష్కరించుకుంటారు.

ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. వాహన ప్రమాద సూచనలు ఉన్నవి. వృత్తి, ఉద్యోగమునందు శ్రమ ఎక్కువగా ఉన్నను ఆదాయం కొంత అనుకూలంగా ఉంటుంది. వ్యవసాయదారులకు నష్టాలు తప్పవు. విద్యార్థుల పరీక్షా ఫలితాలు కొంత నిరుత్సాహపరుస్తాయి. కొన్ని రంగము వారికి అనుకూలంగా ఉన్నది. ఈ రాశివారికి ,2-3-6-9- అదృష్ట సంఖ్యలు, సోమ,మంగళ,శుక్ర,ఆదివారములు. అదృష్ట వారములు, లక్కీ నెంబర్.2. ఈ రాశి స్త్రీలకు ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించడం మంచిది. ఇతరుల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వలన సమస్యలు తప్పవు. శనివారం శనీశ్వరునికి తైలాభిషేకం. రాహుకేతూ పూజ చేయించాలి మీరు ప్రస్తుతం అష్టమ శని ప్రభావంలో ఉన్నారు, అనుకూలమైన శుభ ఫలితాల కొరకు గోమాత సమేత ఐశ్వర్య కాళీ అమ్మవారి పటానికి ఎర్రని పూలతో పూజించండి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి భిక్ష కులకు అన్నందానం చేసినశుభం కలుగుతుంది.

**సింహ రాశి ఫలాలు:-** ఆదాయం:-2, వ్యయం:-8, పూజ్యత:-7, అవమానం:-3. మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం వారికి 2024 సంవత్సరంలో మిశ్రమంగా ఉన్నది. తలపెట్టిన పనులు అనుకున్న సమయానికి పూర్తి చేస్తారు. కుటుంబ విషయాలు కొంత చికాకులు గురిచేస్తాయి. సోదర, బంధు వర్గము నుండి సహాయ సహకారము అందుతుంది. ఇంటా బయట గౌరవము పెరుగుతుంది. గృహమున శుభాకార్యములు నిర్వహిస్తారు. శత్రు, కోర్టు వ్యవహారాలు ఇతరుల సహకారంతో సులువుగా పరిష్కరిస్తారు. కుటుంబ సభ్యుల సహాయంతో కొన్ని పనులు పూర్తిచేస్తారు. వాహన ప్రయాణ విషయంలో జాగ్రత్త అవసరం.

వృత్తి, ఉద్యోగమునందు ఒత్తిడి పెరిగిన అధికారుల అనుగ్రహంతో పూర్తిచేస్తారు. వ్యవసాయదారులకు అన్ని పంటలు కలసివచ్చి ఆదాయము పెరుగుతుంది. విద్యార్థులకు నూతన విద్య అవకాశములు లభిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభం చేస్తారు. రాజకీయ నాయకులకు నూతన పదవీయోగము. కొన్ని రంగములు వారికి కొంత సామాన్యంగా యున్నది. ఈ రాశివారికి,1-2-5-6-9 అదృష్ట సంఖ్యలు, శని, బుధ, శుక్ర, సోమవారములు, అదృష్ట వారములు. లక్కీ నెంబర్ (6). ఈ రాశి స్త్రీలకు నూతన మంచి ఆలోచనలతో ముందుకు సాగుతారు. ఆదిత్య హృదయ స్తోత్రం పారాయణం చేయించాలి. ప్రస్తుతం మీరు శని భగవానుని సప్తమ వీక్షణలో ఉన్నారు కాబట్టి అనుకూలమైన శుభ ఫలితాల కొరకు గోమాత సమేత ఐశ్వర్య కాళీ అమ్మవారి పటానికి ఎర్రని పూలతో పూజించండి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి, భిక్ష కులకు అన్నందానం చేసిన.శుభం కలుగుతుంది.

**కన్యారాశి ఫలాలు:-** ఆదాయం:-5, వ్యయం:-5, పూజ్యత:-5, అవమానం:-2. ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాల వారికి 2024 సంవత్సరంలో మిశ్రమంగా ఉన్నది. ఆరోగ్య విషయమలో తగిన శ్రద్ధను తీసుకోవడం మంచిది. పనులందు కష్టము తప్ప ఫలితం కనిపించదు. శిరో సంభంద అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ, ఆర్థిక విషయాలు కొంత సామాన్యం. బంధువర్గము నుండి సహాయ సహకారము లభిస్తుంది. గృహంలో శుభకార్యాలు నిర్వహిస్తారు. సంతాన పరంగా ధన వ్యయం తప్పదు. భాగస్వామ్య వ్యాపారాలు కొంత అనుకూలిస్తాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ధన వ్యవహారములలో తొందరపాటు పని చేయ్యదు. వృత్తి, ఉద్యోగమునందు అధికారుల మన్ననలు పొందుతారు. వ్యవసాయదారులకు రెండవ పంట అనుకూలముగా ఉన్నది.

విద్యార్థులు మరింత కష్టపడవలసి వచ్చును. రాజకీయ నాయకులకు గందరగోళ పరిస్థితులు తప్పవు. ఈ రాశివారికి 1-3-5-6-7-9 అదృష్ట సంఖ్యలు, ఆది,మంగళ,గురు, శుక్రవారములు. లక్కీ నెంబర్ (6)ఈ రాశి స్త్రీలు, కుటుంబమున గౌరవము తగ్గును. అకారణ కలహా సూచనలు ఉన్నవి. అనుకూలమైన శుభ ఫలితాల కొరకు గరికతో గణపతికి పూజ చేయండి,పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి శుభం కలుగుతుంది.

**తులారాశి ఫలాలు:-** ఆదాయం:-2, వ్యయం:-8, పూజ్య త:-1, అవమానం:-5. చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3, పాదాల వారికి 2024 సంవత్సరంలో అనుకూలకాలముగా ఉన్నది. వ్యాపారమున నూతన ప్రయత్నాలు లాభిస్తాయి. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రాప్తి. కుటుంబ ఆర్థిక విషయాలు సంతృప్తికరంగా ఉంటాయి. సోదర, బంధు వర్గము వారి నుండి సంపూర్ణ సహకారము అందుతుంది. గృహమున శుభకార్యాలు విజయవంతంగా పూర్తిచేస్తారు. కోర్టు, వ్యవహారాలు సానుకూలముగా సాగుతాయి. భాగస్వామ్య వ్యాపారాలు కలసివస్తాయి.

భార్యతో కొన్ని విషయాలలో మాట పట్టింపులు తప్పవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృత్తి, ఉద్యోగము నందు అధికారుల ఒత్తిడి తప్పదు. వ్యవసాయదారులకు అన్ని పంటలు కలసి వచ్చి ఆదాయము చేతికందును. విద్యార్థులకు ఆశించిన ఫలితాలను సాధించుటలో పోటీపడతారు. కొన్ని రంగముల వారికి అనుకూలంగా యున్నది. రాజకీయ నాయకులకు ఇతరుల వలన సమస్యలు తప్పవు. ఈ రాశివారికి 1-3-4-6-9 అదృష్ట సంఖ్యలు, మంగళ,బుధ, శుక్రవారములు అదృష్ట వారములు, లక్కీ నెంబర్ (5)ఈ రాశి స్త్రీలకు నూతన కార్యక్రమములు ప్రారంభిస్తారు. ఇంట బయట విలువ పెరుగుతుంది. అనుకూలమైన శుభ ఫలితాల కొరకు నవగ్రహ స్తోత్రం పాటించాలి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి, భిక్ష కులకు అన్నందానం చేసినశుభం కలుగుతుంది.

**వృశ్చిక రాశి ఫలాలు:-ఆదాయం:-** 8, వ్యయం:-14, పూజ్య త:-4, అవమానం:-5. విశాఖ 4 వ పాదం, అనురాధ, జ్యేష్ట నక్షత్రాల వారికి 2024 సంవత్సరంలో సామాన్యముగా ఉన్నది. కుటుంబ, ఆర్థిక విషయాలు నిరుత్సహపరుస్తాయి. సోదర, బంధు వర్గమువారి నుండి వ్యతిరేకత పెరుగుతుంది. గృహమున శుభకార్యములు శ్రమచేత పూర్తి చేస్తారు. భూ క్రయ విక్రయ విషయంలో నష్టములు తప్పవు. శుభకార్యములు వాయిదా వేసుకొనుట మంచిది. భాగస్వామ్య వ్యాపారాలు కొంత నిరాశకు గురిచేస్తాయి. వృత్తి, ఉద్యోగమునందు అభివృద్ధి లేకున్నను అందరి మన్ననలతో ముందుకు సాగుతారు. వ్యవసాయదారులకు కొంత సామాన్యంగా ఉన్నది. విద్యార్థులకు కోరుకున్న విద్యను పొందుటకు అధిక శ్రమ పడవలసి వచ్చును. అన్ని రంగముల వారికి సామాన్యం.

ధన వ్యవహారములలో మధ్య వర్తిత్వం వలన సమస్యలు తప్పవు. ఈరాశివారికి. 1-2-4-6-8-9 అదృష్ట సంఖ్యలు, గురు, బుధ,శుక్ర, శనివారములు. అదృష్ట వారములు. లక్కీ నెంబర్ (9)ఈ రాశి స్త్రీలకు ఏపని చేసినను కార్య ఆటంకములు తప్పవు. ధన వ్యవహారములందు శ్రద్ధ వహించాలి. గోచారరిత్యా అర్థాష్టమ శని ప్రభావంతో ఉన్నారు, గోమాతకు గ్రాసం పెట్టండి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి , భిక్ష కులకు అన్నందానం చేసినశుభం కలుగుతుంది.

**ధనుస్సు రాశి ఫలాలు:-** ఆదాయం:-11, వ్యయం:-5, పూజ్య త:-7, అవమానం:-5. మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 వ పాదం వారికి 2024 సంవత్సరంలో విశేషముగా ఉన్నది. అనుకున్న సమయానికి పనులు పూర్తి అగును. విదేశీ ప్రయాణములు లాభిస్తాయి. కోర్టు వ్యవహారములందు విజయం సాధిస్తారు. శత్రువులు సహాయ సహకారాలు అందుతాయి. ఆర్థిక విషయాలు మెరుగుపడతాయి. సోదరుల నుండి కొన్ని వ్యవహారాలలో నిరాశ తప్పదు. నూతన గృహాన్ని కొనుగోలుచేస్తారు. వృత్తి, ఉద్యోగము నందు సమస్యలు ఉన్న ముందుకు సాగుతారు. దూర ప్రాంత బంధు వర్గం నుండి శుభవర్తమానాలు అందుతాయి.

సంతాన వివాహ ప్రయత్నాలు సఫలమౌతాయి. వ్యవసాయదారులకు ముఖ్యమైన పంటలు లాభిస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. విద్యార్థులకు నూతన విద్యా అవకాశాలు లభిస్తాయి. అన్ని రంగముల వారికి అనుకూలముగా ఉండును. ఈ రాశివారికి 1-3-5-6-9 అదృష్ట సంఖ్యలు, ఆది,గురు, బుధ, శనివారములు, లక్కీ నెంబర్:- (3) స్త్రీలకు ఆదాయం మెరుగుపడును. అనారోగ్య సమస్యలు కొంత బాధించును. అనుకూలమైన శుభ ఫలితాల కొరకు మృత్యంజయ జపం చేయడం మంచిది. పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి భిక్ష కులకు అన్నందానం చేసినశుభం కలుగుతుంది.

**మకర రాశిఫలాలు:-** ఆదాయం:-14, వ్యయం:-14, పూజ్య త:-3, అవమానం:-1,. ఉత్తరాషాఢ, 2, 3, 4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాల వారికి 2024 సంవత్సరంలో సానుకూలముగా ఉన్నది. నూతన వ్యాపారాలను ప్రారంభిస్తారు. ఆర్థిక విషయాలు అనుకూలంగా ఉంటాయి. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. కోర్టు వ్యవహారములందు చికాకు కలిగిస్తాయి. ధన వ్యవహారాలలో నిరుత్సాహం తప్పదు. కుటుంబ విషయాలలో సానుకూలముగా ముందుకు సాగుతారు. సోదర, బంధు వర్గము వారి నుండి కొంత వ్యతిరేకత కల్గుతుంది.

శత్రు సంబంధమైన సమస్యలు తప్పవు. ప్రయాణాలలో ప్రమాద సూచనలు ఉన్నవి. వ్యవసాయదారులకు ముఖ్యమైన పంటలు లాభిస్తాయి. విద్యార్థులకు నూతన విద్య అవకాశాలు పొందుతారు. కొన్ని రంగముల వారికీ అనూలముగా యున్నది. ఈ రాశివారికి 1-3-6-7-9. అదృష్ట సంఖ్యలు,, సోమ, బుధ,గురు, శుక్రవారములు అదృష్ట వారములు:-లక్కీ నెంబర్ (8)ఈ రాశి స్త్రీలకు విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. అధికారుల సహాయంతో చాలా వరకు పనులు పూర్తవుతాయి. ఏలినాటి శని ప్రభావంతో ఉన్నారు, అనుకూలమైన శుభ ఫలితాల కొరకు కాకులకు బెల్లంతో చేసిన గోధుమ రొట్టెలను వేయండి, ప్రతీ రోజూ రావి చెట్టుకు 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని స్మరిస్తూ 11 ప్రదక్షిణలు చేయండి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి భిక్ష కులకు అన్నందానం చేసినశుభం కలుగుతుంది.

**కుంభరాశి ఫలాలు:-** ఆదాయం:-14, వ్యయం:-14, పూజ్య త:-6, అవమానం:-1. ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాల వారికి 2024 సంవత్సరంలో కొంత సామాన్యంగా ఉన్నను అవసరానికి సరిపడ సమయానికి పనిని పూర్తిచేసుకుంటారు. శారీరకముగా స్వల్ప అనారోగ్యములు తప్పవు. కుటుంబ, ఆర్థిక విషయాలు ఋణ ఒత్తిడి అధికమౌతుంది. సోదర, బంధువర్గము నుండి వ్యతిరేకత. శుభకార్య ఆటంకములు తప్పవు. శత్రు భయం పెరుగును. విదేశీ వ్యవహారాలు సంవత్సరాంతమున పూర్తి అవుతాయి. భాగస్వామ్య వ్యాపారాలలో సొంత ఆలోచనలతో ముందుకు సాగుటం మంచిది.

వృత్తి, ఉద్యోగమునందు సామాన్యముగా ఉన్నను పేరును సంపాదిస్తారు. క్రయవిక్రయాలలో చాలా శ్రద్ధ అవసరం వ్యవసాయదారులకు క్రొత్త పంటలు లాభించి ఆదాయము చేకూరుతుంది. విద్యార్థులకు ఉన్నత విద్య కొరకు ఎక్కువ ధనాన్ని ఖర్చుచేయవలసి వస్తుంది. కొన్ని రంగముల వారికి అనుకూలంగా ఉన్నవి. ఈ రాశివారికి 3-4-5-8-9 అదృష్ట సంఖ్యలు,, ఆది,సోమ,గురు, శుక్రవారములు. అదృష్ట వారములు,, లక్కీ నెంబర్ (8)ఈ రాశి స్త్రీలకు సామాన్యంగా ఉన్నది ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. ప్రభుత్వ సహాయ సహకారములు అందుతాయి. ఏలినాటి శని ప్రభావంతో ఉన్నారు, అనుకూలమైన శుభ ఫలితాల కొరకు కాకులకు బెల్లంతో చేసిన గోధుమ రొట్టెలను వేయండి, గోమాత సమేత ఐశ్వర్య కాళీ అమ్మవారి పటానికి ఎర్రని పూలతో పూజించండి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి భిక్ష కులకు అన్నందానం చేసిన శుభం కలుగుతుంది.

**మీనరాశి ఫలాలు:-** ఆదాయం:- 11,, వ్యయం:-5, పూజ్య త:-2, అవమానం:-4,,పూర్వాభాద్ర 4 వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి వారికి 2024 సంవత్సరంలో సామాన్యముగా ఉన్నది. స్థిరమైన ఆలోచనలు లేక నిలకడ లోపిస్తుంది. కుటుంబ, ఆర్థిక విషయాలు చికాకులు కల్గించినను నిదానముగా ముందుకు సాగుతారు. సోదరవర్గము నుండి ఆదాయమార్గాలు పెరుగుతాయి. బంధువుల నుండి వ్యతిరేకత తప్పదు. సంఘంలో గౌరవం తగ్గుతుంది. కోర్టు వ్యవహారాలు అనూకులత తక్కువ. జీవిత భాగస్వామికి ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. పుణ్యకార్యములకు, విశేషంగా ధన వ్యయం చేస్తారు. గతంలో నిలచిన ఆస్థి వ్యవహారాలు సంవత్సరాంతమున పూర్తిచేస్తారు. వృత్తి, ఉద్యోగమునందు అభివృద్ధి నత్త నడకన సాగును. వ్యవసాయదారులకు రెండవ పంట అనుకూలముగా ఉన్నది.

విద్యార్థులకు నూతన ప్రయత్నములచే విద్యా కార్యములను పూర్తి అగును. ఋణాలను ఎక్కువగా చేయవలసి రావచ్చు. కొన్ని రంగముల వారికి పని ఒత్తిడి పెరుగును. ఈ రాశివారికి 1-3-4-5-7-9. మంగళ, బుధ, గురు, శుక్రవారములు. అదృష్ట వారములు,, లక్కీ నెంబర్ (3)ఈ రాశి స్త్రీలకు ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించడం మంచిది. ఏలినాటి శని ప్రభావంతో ఉన్నారు, అనుకూలమైన శుభ ఫలితాల కొరకు కాకులకు బెల్లంతో చేసిన గోధుమ రొట్టెలను వేయండి, సూర్య దేవుని ఆరాధన చేయండి, పశు, పక్ష్యాదులకు త్రాగడానికి నీళ్ళను ఏర్పాటు చేయండి భిక్షకులకు అన్నం దానం చేసిన శుభం కలుగుతుంది.

# జనసేన పార్టీ కి భారీ చేరికలు




పరవాడ, (విశాఖ సమాచారమ్): బిజెపి, టిడిపి, జనసేన ఉమ్మడి పెందుర్తి అభ్యర్థి అయిన పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో లంకెలపాలెం, ముత్యాలమ్మ పాలెం నుండి వైకాపా కు చెందిన సుమారు 1000 మంది జనసేన పార్టీ లో చేరారు. 2013 లో పంచకర్ల రమేష్ బాబు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలుపొంది పెందుర్తి నియోజకవర్గ ప్రజల ఆధార అభిమానాలు పొందిన వ్యక్తిగా మంచి పేరు సంపాదించుకున్నారు. మరల మరొకసారి పంచకర్లను గెలిపించి నియోజకవర్గం, పరవాడ మండలం అభివృద్ధి బాటలో నడిపించాలని ఆశతో ప్రజలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ప్రస్తుత వైకాపా అభ్యర్థి అయిన అదీప్ రాజు గడిచిన 5 సంవత్సరాలు ఎమ్మెల్యేగా మండల ప్రజలకు ఎటువంటి ప్రత్యేక అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శలను వినిపిస్తున్నాయి. ప్రజలకు అదీప్ రాజు అందుబాటులో లేకపోవటమే దీనికి కారణమని ప్రజలు అనుకుంటున్నారు. ముఖ్యంగా పార్టీ లో ముఖ్య నాయకులకు విలువలు ఇవ్వకపోవడం, సొంత స్వలాభం కోసం పనిచేయటం మండలంలో నాయకుల మనసుల్లో నాటుకుపోయిన మాట. పంచకర్ల రమేష్ బాబు గెలుపు కొరకు జనసేన టిడిపి కార్యకర్తలు నాయకులు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు తీర్పు ఎలా ఇవ్వబోతున్నారో వేచి చూడాల్సిందే!

## ఫార్మా ప్రమాదాల్లో ఇద్దరు మృతి, 5గురుకి తీవ్ర గాయాలు




పరవాడ, (విశాఖ సమాచారమ్): జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో రెండు ఫార్మా పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా ఐదుగురు కార్మికులు తీవ్ర గాయాలు పాలయ్యారు. అల్కలీన్ మెటల్స్ యూనిట్ 3 మిథైల్ నైట్రేట్ గ్యాస్ లీక్ అయిన ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని అనకాపల్లి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా వైద్య చికిత్స పొందుతూ సిహెచ్ రమణ (32) అనే కార్మికుడు మృతి చెందాడు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలానికి చెందిన రమణ గత కొన్ని సంవత్సరాలుగా అల్కలీన్ మెటల్స్ ఫార్మా కంపెనీలో పని చేస్తున్నాడు. రమణకి ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. మిగిలిన ఐదుగురు వ్యక్తులలో ముగ్గురు తీవ్ర గాయాలతో అనకాపల్లి ఆస్పత్రిలో వైద్య చికిత్స పొందుతుండగా ఇద్దరు గాజువాక లోని ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే అరబిందో ఫార్మా కంపెనీ సబ్సిడరీ కంపెనీ అయిన ఎప్టోరియా యూనిట్-6 లో జరిగిన రియాక్టర్ తేలిన ప్రమాదంలో అక్కడే పని చేస్తున్న ఆళ్ల గోవిందా (32) తీవ్ర గాయాల పాలు కాగా అగనంపూడి లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించటంతో ఎటాప్సి కోసం విశాఖ కేజీ ఆసుపత్రికి తరలించారు. కాగా అల్కలీన్ మెటల్ కంపెనీలో ఇది మూడో ప్రమాదంగా చెబుతున్నారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహించకపోవడంతో ఫార్మా కంపెనీలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రమాదాలపై ఫ్యాక్టరీస్ ఇన్స్పెక్టర్, జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకొని బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

# ఘనంగా శ్రీశ్రీ నూకాలమ్మ తల్లి పండగ



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ లో శ్రీశ్రీశ్రీ నుకాలమ్మ తల్లి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని , ప్రత్యేక పూజలు నిర్వహించి , తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వద్ద ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు , ఉప సర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్ పైల అప్పారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, గొరుపూటి వెంకటరమణ, చీపురుపల్లి సన్యాసిరావు, పైల పైడం నాయుడు, చీపురుపల్లి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ ఎం పి ఎంఎల్ఏ గెలుపు తోనే బస్కి లో పి హెచ్ సి సాధ్యం



అరకులోయ, (విశాఖ సమాచారమ్): పార్లమెంట్ అభ్యర్థి పాచిపెంట అప్పలనరస సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంగరాజు (అనంతగిరి జెడ్పిటిసి) వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, అరకువేలి మండలం బస్కి పంచాయితీ సమగ్రాభివృద్ధి అడవి మీద హక్కు,విద్య ,వైద్యం పేదలకు అందేవిధంగా కృషి చేస్తాం ,నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం జివో నెంబర్ 3 చట్ట బద్ధత కల్పించాలని పోరాడుతాం ,సబ్ ప్లాన్ నిధులు సాధన కోసం ఏజెన్సీ అభివృద్ధికి ఆదివాసి గిరిజనుల తరపున చట్టసభల్లో పోరాడి సాధించుకోవడానికి మీ తరపున మేముంటామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంత చట్టాలు హక్కులు అమలు కోసం చిత్త శుద్ధితో పనిచేస్తుందన్నారు. బోయ వాల్మీకులను ఎస్టి జాబితాలో కలపాలని వైసిపి, టిడిపి చేసిన తీర్మానాలను అడ్డుకుంటాం

ఆదివాసి గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన వన్ టై సెవెన్‌టీ చట్టం పటిష్టంగా అమలు కోసం చట్టసభల్లో పేదల గొంతై నిలదీస్తాం.

బాక్సైట్ ,హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అనుమతులను అడ్డుకుంటాం మైనింగ్ అటవీ సంపదలను కాపాడుతాం!

ఊసరవెల్లిలా రంగులు మార్చే నాయకులను బిజెపి పార్టీ తొత్తుగా ఉండే టిడిపి, వైసిపి జనసేన పార్టీలను ఆదివాసులు ఓడిస్తేనే పేదలకు న్యాయం జరుగుతాయని అన్నారు.

కాయకష్టలతో మన పిల్లలను చదివిస్తున్నాం కానీ ఈ ఐదేళ్ల కాలంలో ఒక్క డీఎస్సీ జనవరి క్యాలెండర్ లేదు ఆడుదాం ఆంధ్ర పేరుతో యువతి యువకుల జీవితంతో వైసిపి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ఆడుకున్నది.

గిరిజనుల సమస్యలపై హక్కులపై ఏనాడు చర్చించని నాయకుడు కేవలం ఆదివాసుల అమాయకత్వాన్ని ఓట్ల రూపంలో సొమ్ము చేసుకుంటూ కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆదివాసి ప్రాంత రక్షణకై గిరిజన హక్కుల చట్టలు పటిష్టంగా అమలు కోసం గిరిజన ప్రాంత సమగ్ర అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను మీ అమూల్యమైన ఓటు లిసుత్తికొడవలి నక్షత్రంలి గుర్తుకి వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు .

ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, సిపిఎం పార్టీ మండల నాయకులు పొద్దు బాలదేవ్, పాంగి రాజు, పూజారి చందర్ ,బురిడి గోపాల్, సమర్ధి మెద్నా, కృష్ణ , స్వామి,గోవింద్, మార్కండ్ , పి.భీష్మ, వార్డు మెంబర్ సమర్ధి మొస్య , గొల్లూరి అప్పలనాయుడు (వార్డు మెంబర్) బురిడి కొండబాబు, సొన బాబు, శోభన్, సోనియా గోపి,లతో పాటు గుగ్గుడు,రంగిని గుడ, కుంటి రంగిని,సిందిపుట్ , మొర్రిగుడ,బస్కి, కంజరితోట,జాకరవలస గ్రామాలు గిరిజనులు పాల్గొన్నారు.

## శుక్లామ్బరధరం వర్సెస్ కాఫీ!

కాంచి మహా పెరియవర్ శ్రీ శ్రీ శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి మంచి హాస్య ప్రియులు.

ఒకరోజు తన శిష్యుని పిలిచి, సంధ్యా వందనం అయిందా? శుక్లాం బరధరం అయిందా? అనిఅడిగారు.

వెంటనే ఆ శిష్యుడు అయిందని తల ఆడించాడు.

దానికి మహా పెరియవర్ అతనితో .... "శుక్లాం బరధరం చెప్పావా అని అడగలేదు. అయిందా అని అడిగాను" అన్నారు.

శిష్యుని కి ఏమీ అర్థం కాలేదు.? పెరియవర్ ఏమని అడిగారు? ఈ పదాలకు వున్న భేదాలేవీ బోధపడక పరితపించాడు. అతనికి సందేహంగాను వుంది.

కొన్ని నిమిషాలు మౌనంగా గడిచిన తరువాత, మహా పెరియవర్ అతనితో "శుక్లాం బరధరం" చెప్పు చూద్దాం అన్నారు.

పెరియవర్ చెప్పమన్న వెంటనే, "శుక్లాం బరధరం విష్ణుం శశి వర్ణం చతుర్భుజం ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోప శాంతయే ".... అని శిష్యుడు చెప్పాడు.

శిష్యుడు చెప్పింది విన్న మహాపెరియవర్...

"దీనికి అర్థం తెలుసా?" అని అడిగారు.

"తెలుసు" అని బదులు చెప్పిన శిష్యుడు .....

తెల్లని మనసు, యేనుగులా నల్లని రంగు, నాలుగుచేతులు, ప్రకాశమయిన ముఖం, అందరూ తలచి చూసేలా చేయు ఆకారం వున్న వినాయకుని స్మరిస్తే ఏవిధమైన ఆటంకాలు, బాధలూ వుండవని చెప్పాడు.

అరే !

సరిగ్గా చెప్పావే,దానికి ఇంకో అర్థం వుంది, అది నీకు తెలుసా? అని చెప్పి,నవ్వారు.

శుక్లాం అంటే తెల్లనిది.

అంటే పాలు.

విష్ణుం అంటే నలుపు.

అది డికాషన్.

శశి వర్ణం అంటే నలుపు తెలుపు కలిసినది.

అంటే "కాఫీ".

చతుర్భుజం అంటే నాలుగు చేతులు.

అంటే, భార్యవి రెండుచేతులు, కాఫీ ఇవ్వగానే అందుకునే భర్తవి రెండు చేతులు - కలిసి నాలుగు చేతులు.

"ధ్యాయేత్" అంటే తలిచే తలపులు.

అంటే అలాకాఫీ ఇవ్వడాన్ని మనసులో తలవగానే ....

"ప్రసన్న వదనం " ముఖం వికసిస్తుంది ఆసమయంలో.

"సర్వ విఘ్నోప శాంతయే" అంటే ....

అన్ని వేదనలూ పోగొట్టేది.

అనగా కాఫీ త్రాగితే వేదనలుతీరి, మనసు శాంతమవుతుందని అర్థం.

శుక్లాం బరధరం అయిందా .... అన్న ప్రశ్నలో , కాఫీ త్రాగటం అయ్యిందా? అన్న అర్థం - దానిలో ఇమిడి వుంది.....

అని తెలుసుకున్న శిష్యులు మైమరచి నవ్వనారంభించారు.

కంచి పెరియవర్ చిరునవ్వులు చిలకరించారు.

## అంబరాన్ని అంటిన నూకాంబిక అమ్మవారి అంబలం పూజ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అనకాపల్లి శ్రీ నూకంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర మహోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి మాల ధారాల సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను అధ్వర్యంలో ఆలయ అవరణలో నూకాంబిక అమ్మవారి భారీ అంబలం పూజ ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ పూజలో ప్రముఖ బిల్డర్ కాంట్రేగులనాయుడు భాగ్యలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అంబలం పూజలో పాల్గొన్న మాలదారులు ఆలపించిన నూకాంబిక అమ్మవారి భక్తి గీతాలు భక్తులను భక్తి పారావస్యంలో ముంచెత్తాయి. అంబలం పూజను తిలకించే పెద్ద సంఖ్యలో భక్తులు ఆరోగ్యానికి తరలు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# గిరిజన యువత ఉపాధి కి టీడీపీ ఎన్‌డిఏ భరోసా



పాడేరు, (విశాఖ సమాచారమ్): రాబోయే ఎన్నికల్లో బీజేపీ ,జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులు గెలుపు కోసం శ్రమించి ఉమ్మడి అభ్యర్థులు ఉమ్మడి నాయకత్వం లో గెలవబోతున్నామని టీడీపీ అరకు పార్లమెంట్ ఇంచార్జి కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు,ఆదివారం పాడేరు లో వెంకటేశ్వర ఇన్ లో పాత్రికేయులు సమావేశంలో జనసేన ,బీజేపీ టీడీపీ నాయకులు తో కలసి ఆయన మాట్లాడారు, ఈ సందర్భంగా వైసీపీ అరాచకం పై మూడు ఉమ్మడి పార్టీలు రాష్ట్రంలో కేంద్రంలో 2024 ఎన్నికల కు వెళుతున్నామని రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మద్యం మాఫియా, ఇసుక మాఫియా, పంచాయతీ నిధులు సైతం దోచుకున్న ప్రభుత్వం వైసీపీ అని రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా రాష్ట్ర ప్రజల నుండి విద్యుత్, చార్జీలు పెంచి ప్రజలు నడ్డి విరిచింది అని ఆయన దుయ్యబట్టారు, గిరిజన ప్రాంతాల్లో జీవో నంబర్ 3 రద్దు చేసి. ఉపాధి అవకాశాలు లేకుండా చేసిందని రాబోయే టీడీపీ ప్రభుత్వం వస్తే తాము జోవో నంబర్3 పునరుద్ధరణ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు, వైసీపీ అటువంటి భరోసా ఇస్తుందా అని వైసీపీ కి సవాల్ విసిరారు, వైసీపీ ప్రభుత్వం ఒక్క గ్రామంలో అన్న సీసీ రోడ్లు గాని గృహ నిర్మాణం అన్న చేపట్టిందా అని ప్రశ్నించారు, అరకు పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి బీజేపీ,టీడీపి ,జనసేన అభ్యర్థులు గెలుపు కు పూర్తి బాధ్యత తీసుకుని గెలిపిస్తాం అని తెలిపారు, బీజేపీ పార్లమెంటరీ అభ్యర్థి కొత్తపల్లి గీత కు కమలం గుర్తుకు పాడేరు అసెంబ్లీ అభ్యర్థి కిల్లు వెంటట రమేష్ నాయుడు కి సైకిల్ గుర్తుకు పై ఓటు వేసి గెలిపించాలని కోరారు, పాడేరు బీజేపీ జనసేన ఉమ్మడి అభ్యర్థి కిల్లు రమేష్ నాయుడు మాట్లాడుతూ తనకు టీడీపీ టిక్కెట్ ఇచ్చిన నారా చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞత తెలుపు తున్నా అంటూ రాష్ట్రంలో కేంద్రంలో డబుల్ ఇంజన్ సర్కారు వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందు తుందని రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతోంది అని గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు లేకుండా వైసీపీ ప్రభుత్వం జీవో నంబర్ 3 తొలగించిదని టీడీపీ ప్రభుత్వం వస్తే ఖచ్చితంగా జివో నంబర్ పునరుద్ధరణ చేస్తున్నారు తనును గెలిపిస్తే గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కి కృషి చేస్తానని చెప్పారు,పాడేరు అసెంబ్లీ లో సైకిల్ ,కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ను అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని కోరారు, ఈ కార్యక్రమంలో బీజేపీ పాడేరు అసెంబ్లీ కన్వీనర్ కుడా కృష్ణా రావు,జనసేన అధికార ప్రతినిధి బొంకుల స్వర్ణలత, కమల్ హాసన్, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ పెనుమాక, బీజేపీ మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పాపిటి రాజు,బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సల్లా రామకృష్ణ, టీడీపీ బాకురు సర్పంచ్ బాకురు వెంటట రమణ,టీడీపీ ధరేల సర్పంచ్ పాండు రంగస్వామి, బీజేపీ పాడేరు మండల అధ్యక్షుడు పాంగి రవిచంద్ర, టీడీపీ ఎంపీటీసీలు ,ఉల్లి రామారావు, బొంజు పడాల్ ,బీజేపీ జిల్లా కోర్ కమిటీ సభ్యులు కుడుముల వంకట రమణ టీడీపీ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది



తెలుగు సంవత్సరాది నిశ్శబ్దంగా మన ఇంట్లోకి వచ్చింది. హెూ రెత్తించే మైకులు నిషా తో ఖుషి గా చెప్పే శుభాకాంక్షలు. అర్ధరాత్రి వరకు పబ్బుల్లో క్లబ్బుల్లో డాన్సులు. తెలిసిన వాళ్ళకి తెలియని వాళ్ళకి చెప్పే చరవాణి శుభాకాంక్షలు.

ఇవేవీ లేవు ఆనందంగా నిశ్శబ్దంగా మన ఇంటికి వచ్చింది తెలుగు సంవత్సరాది. సంస్కృతి సంప్రదాయం వెంటబెట్టుకుని మరీ వచ్చింది మన ఇంటికి. పుడుతూనే పేరు పెట్టుకుని కోయిల సన్నాయి రాగం పలుకుతుంటే దారి పొడుగునా చెట్టుకొమ్మలన్నీ కొత్త చిగురు తొడిగి బాపు గారి బొమ్మల మెరిసిపోయి పిల్ల తిమ్మెర్లు వీస్తుంటే చిటారు కొమ్మనున్న మిఠాయి పొట్లం పుటుక్కున తెంపి పండగ ప్రసాదానికి పచ్చిమామిడి తెచ్చి ఇచ్చింది.

అవి ఆకాశంలో మెరిసిపోయే తారలు కాదు పూజకు పనికిరాని పువ్వులు అంటూ జీవితంలో చేదునిజాలు తెలిసినప్పుడు తట్టుకునే గుండె ధైర్యాన్ని ఇచ్చింది. చింత చెట్టు మీద దయ్యం ఉంటే నాకేం భయం ముందుకు సాగిపోవడమే జీవితం అని జీవితానికి ఒక కొత్త రుచిని అలవాటు చేసింది. జీవితమంటే ఒలిచిపెట్టిన అరటి పండు కాదు బెల్లం కొట్టిన రాయిలా కూడా ఉండదు జీవితాన్ని తీపిగా అనుభవించడం మన చేతుల్లోనూ చేతల్లోనూ ఉంది అంటూ చెప్పకనే చెబుతూ గుండెల్లో ఎన్ని బాధలు ఉన్నా ఎప్పుడూ నిటారుగా ఉండి తీపిని పంచే చెరుకుని ముక్కలు చేసి తీపి జీవితంలో ఒక భాగం అని చెప్పింది.

సంతోషానికి సంకేతం అని పండగ ప్రసాదానికి మరింత రుచి తెచ్చింది. ఎప్పుడూ పరవళ్ళు తొక్కుతూ ఎగిసిపడే కెరటాలతో ఉత్సాహంగా ఉండే సాగరాన్ని చూసి ఉత్సాహానికి కారణం ఏమిటని ఆలోచించి దాని గుండెల్లో ఉండే కన్నీళ్ల మనకు ఉత్సాహం పెంచే ఉప్పు రాళ్ళని బదులు తెచ్చింది.

ఎప్పుడు సుఖాలేనా కష్టాలు వచ్చినప్పుడు కదా జీవితం విలువ తెలుస్తుంది అంటూ పచ్చ మిర్చిని పచ్చడి చేసి కళ్ళు నీళ్ల తెప్పించింది. జీవితం అంటే ఏమిటో చెప్పేసావు అన్ని రుచులు అక్షరాల చూపించావు. ఇంతకీ నీ పేరేమిటి అని అడిగితే నా పేరు చూసి భయపడకండి. నా పేరు క్రోధి నేను మీకు విరోధిని కాదు. పేరులో ఏముంది పెన్నిధి ఎవరి తలరాత వారిదే అని పంచాంగం విప్పి చెప్పింది. ఆదాయం మన అదృష్టాన్ని బట్టి వ్యయం మనం చేతుల్లోనూ చేతల్లోనూ ఉంటుందని అంటూ చెప్పకనే చెప్పింది. మరి కష్ట సుఖాలు గురించి అమాయకంగా అడిగితే ఆ నదిని దాటాలంటే రెండు పడవలు తప్పనిసరి అంటూ తాత్వికంగా చెప్పింది. ఇంకో ప్రశ్న నేను వేయకుండానే సమాధానం నవ్వుతూ చెప్పింది నరం లేని నాలుక ఎవరిని ఎప్పుడు తిడుతుందో ఎప్పుడు పొగుడుతుందో ఎవరికి తెలుసు అదే రాజ్య పూజ్యం తల దించుకునేలా చేసేది అవమానం. అంటూ జీవిత రహస్యం చెప్పేసింది. నా సందేహాలు అన్ని తీరిపోయేయి. పండగ పరమార్థం తెలిసిపోయింది.

రచన మధునాపంతుల చిట్టి వెంకట సుబ్బారావు
కాకినాడ 9491792279

## సింహాద్రి అప్పన్నకు ఘనంగా సహస్రనామార్చన



సింహాచలం, (విశాఖ సమాచారమ్): సింహాచలం ఆలయంలో సింహాద్రి అప్పన్నకు ఘనంగా సహస్రనామార్చనను నిర్వహించారు. ఉత్సవమూర్తి అయిన గోవింద రాజస్వామిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఆలయ కళ్యాణ మండపంలో అధిష్టింపచేశారు. పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో విష్వక్సేన పూజ పుణ్యాహవాచనం కార్యక్రమాలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం మంగళ శాసనం తర్వాత భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

## ఘనంగా అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ప్రారంభం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు కోరిండా కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా పేరుగాంచిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర ఆదివారం రాత్రి నుండి ఘనంగా ప్రారంభమైంది. సోమవారం కొత్తమూవాస్య సందర్భంగా అమ్మవారి



ప్రత్యేక అలంకరణ, కుంకుమ పూజలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయం వెలుపల రోడ్లపై భక్తులు బారులు తీరారు. ఆలయ నిర్వహకులు భక్తుల కోసం చలువ పందిరిల్లు షామియానాలు ఏర్పాటు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.




## హాస్పటల్స్ నర్సింగ్ హెూమ్‌లు మొదలైనవి జీఎస్‌టి చెల్లించాలా?



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అవుననే అంటున్నారు కేరళ అథారిటీ ఫర్ అడ్వాన్స్ రూలింగ్.

ఆసుపత్రిలో ఉంటూ చికిత్స పొందుతున్న రోగులకు ఇచ్చే మందులు మరియు ఆహారంపై విడివిడిగా ఛార్జీలు వసూలు చేస్తున్నప్పుడు వారికి అందించే మందులు మరియు ప్రీ ప్యాక్ చేసిన ఆహారంపై జిఎస్‌టి విధించాలని డిమాండ్ చేస్తూ ప్రముఖ ఆసుపత్రులకు అనేక నోటీసులు పంపబడ్డాయి. మందులను ఫార్మసీలో విక్రయించినప్పుడు జిఎస్‌టి చెల్లించవలసి ఉంటుంది కాబట్టి, చికిత్స సమయంలో రోగులకు సరఫరా చేయబడిన మరియు వారికి అందించిన బిల్లులలో వారికి ప్రత్యేక లైన్ ఐటెమ్‌గా బిల్ చేయబడే మందులకు కూడా జిఎస్‌టి చెల్లించబడుతుందా అనేది ఇప్పుడు ప్రశ్న.

ఇది జిఎస్‌టి యుగంలో కొత్త వ్యాజ్యాన్ని రేకెత్తిస్తుంది, అయితే పూర్వపు వ్యాట్ మరియు సేవా పన్ను చట్టం ప్రకారం చికిత్స సమయంలో సరఫరా చేయబడిన మందులు వ్యాట్‌కు పరిధిలోకి రావని తీర్పులు ఉన్నాయి.

సీఏ రామ కృష్ణ సంగు LLB, Mcom, FCA
ఆర్.కె. సంగు అసోసియేట్స్







## వాడవాడలా కొత్త అమావాస్య జాతర వేడుకలు

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** పట్టణ, గ్రామీణంలో కొత్త అమావాస్య పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా యలమంచిలి పట్టణంలో పోస్టాఫీసు వద్ద గల నూకాంబికా ఆలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్ళా రమాకుమారి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.అదే విధంగా మండలంలో పేట బయ్యవరంలో మాజీ వైస్ ఎంపిపి గొన్నాబత్తుల నాగేశ్వరరావు(శేషు), మాజీ సర్పంచ్ గంజి శ్రీనులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం గ్రామంలో ఏర్పాటు చేసిన కోలాటాలు వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పట్టణ, గ్రామీణంలో గల అమ్మవారి ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు కుంకుమ,రవిక,చీరలు సమర్పించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు గంధం శివ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి, ఎటువంటి అసౌకర్యం కలగకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతీ సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా సత్యసాయి సేవా సమితి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సభ్యులు సేవే పరమా వధిగా భావిస్తూ దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మజ్జిగను వచ్చిన ప్రతీ భక్తుడి వద్దకు వెళ్లి మరీ మజ్జిగను పంపిణీ చేశారు.పద్మనాభరాజుపేట గ్రామంలో టీడీపీ నేత ఎడ్ల చిన్నబాబు, పలువురు గ్రామస్తుల ఆధ్వర్యంలో నూకాంబిక అమ్మవారి పండుగను ఎంతో ఘనంగా జరిపారు. ఇందులో



భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత ఎడ్ల కాంతారావు, జనసేన సీనియర్ నేత ఎడ్ల నానాజీ, సేనాపతి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ సభను విజయవంతం చేసిన ప్రజలకు ధన్యవాదాలు: కొణతాల



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అనకాపల్లి పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి మాజీ మంత్రి జనసేన టిడిపి బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొణతాలరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ..సోమవారం రింగ్ రోడ్ లోని జనసేనపార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ..పవన్ కళ్యాణ్ కు అన్ని వర్గాల మద్దతు ఉందని ఆదివారం జరిగిన సభ నిరూపించింది అన్నారు .ఇప్పటివరకు కేవలం యువకుల మద్దతు మాత్రమే ఉందని భావించిన ప్రతి ఒక్కరికి ఈ సభ కనువిప్పు కలిగించిన అన్నారు. మహిళలు వృద్ధులు అన్ని వర్గాల ప్రజలు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేశారని రామకృష్ణ తెలిపారు. అలాగే పవన్ కళ్యాణ్ అనకాపల్లి సమస్యలపై ప్రస్తావించిన ప్రతి సమస్యను అమలు చేయడం జరుగుతుందన్నారు. నూకాంబిక అమ్మవారి ఉత్సవాన్ని రాష్ట్ర స్థాయి ఉత్సవంగా నిర్వహించడమే కాకుండా తను పిఠాపురంలో గెలిచిన వెంటనే ముందుగా అనకాపల్లి నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటానని ప్రకటించటం జరిగిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సహకార రంగంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీలను ఇథనాల్ కర్మాగారాలుగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. బెల్లం మార్కెట్ కు పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. టీటీడీకి అనకాపల్లిబెల్లం వెళ్లేలా చర్యలు తీసుకుంటామన్నారు. .పోలవరం ..సృజల స్రవంతి నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు.. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూస్తామన్నారు . ప్రజలకు మౌలిక వసతులు కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు వ్యవసాయానికి ప్రతి చుక్క నీరు అందేలా అనకాపల్లిలో ఉన్న 11 గ్రోయిన్లు నిర్మాణంపూర్తి చేస్తామని చెప్పారు .ఆర్ ఇ సి ఎస్ కు పూర్వ వైభవం చేస్తామన్నారు. కోఆపరేటివ్ రంగంలోనే నడిపిస్తామని తెలిపారు. అలాగే జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు నాగ జగదీష్ మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిల్చారని ధ్వజమెత్తారు .పట్టణ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, లోక్సత్తా నేత బీశెట్టి బాబ్జి, జనసేన నాయకులు శ్రీరామదాసు గోవిందరావు ,దూలం గోపి, కొణతాల సంతోష అప్పారావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.







VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Parawada : Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, Araku : Cell: 94401 84106,
VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676